


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 276, పేజీలు - 08

మంగళవారం, మార్చి 24, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## హైదరాబాద్‌ను మూడు ప్రత్యేక జోన్లుగా

# విభజిస్తున్నాం

**- హైదరాబాద్ ను అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామన్న రేవంత్**

**- భారీ ఎలివేటెడ్ కారిడార్లను నిర్మిస్తామని వెల్లడి - 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామన్న సీఎం**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ నగర జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో భాగంగా ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించడానికి మెట్రో విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాలు చేపట్టడం వంటి బృహత్తరమైన ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు వెళుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఓఆర్ఆర్ లోపలి కోర్ అర్బన్ ప్రాంత పరిపాలన మొత్తం ఒక గొడుగు కిందకు తెచ్చి హైదరాబాద్ నగర అభివృద్ధికి స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను రూపొందించామని చెప్పారు. శాసనమండలి సభ్యులు లేవనెత్తిన ఒక ప్రశ్నకు సమాధానంగా ముఖ్యమంత్రి హైదరాబాద్ నగర అభివృద్ధిలో భాగంగా మెట్రో, రోడ్ల విస్తరణపై సమగ్రంగా వివరించారు. లాస్ట్‌మైల్ కనెక్టివిటీ లక్ష్యంతో రూ.24 వేల కోట్లతో మెట్రో రెండో దశ 76 కి.మీ మేరకు విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

### మూసీ సుందరీకరణ

'మూసీ సుందరీకరణతో పాటు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మించుకోవడం వల్ల హైదరాబాద్ ఒక అద్భుతమైన నగరంగా మారుతుంది. ట్రాఫిక్ నియంత్రణ కోసం రోడ్లను 3 రకాలుగా విభజించి అభివృద్ధి ప్రణాళికలు తీసుకున్నాం, అండర్ పాస్, సర్ఫేస్ రోడ్లు, ఎలివేటెడ్ కారిడార్లు నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశాం'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.'ఉత్తర తెలంగాణ మార్గంలో అటు కరీంనగర్, ఇటు మేడ్చల్ వైపు కంటోన్మెంట్ ప్రాంతం

2లో..

## పశ్చిమాసియా సంక్షోభం భారత్‌కు

# ఊహించని సవాళ్లు

**- లోక్ సభలో ప్రధాని మోదీ ప్రసంగం**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభం కారణంగా భారత్ ఊహించని సవాళ్లను ఎదుర్కొంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం లోక్‌సభలో వెల్లడించారు. ఈ యుద్ధం గల్ఫ్ దేశాల్లోని భారతీయులపై, దేశ వాణిజ్యంపై, ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత మూడు వారాలుగా కొనసాగుతున్న ఈ సంక్షోభంపై విదేశాంగ మంత్రి జైశంకర్, కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి ఇప్పటికే సభకు వివరించారని గుర్తుచేశారు. ఈ సంక్షోభానికి త్వరగా పరిష్కారం కనుగొనాలని ప్రపంచ దేశాలన్నీ కోరుకుంటున్నాయని తెలిపారు.

### ఇంధన సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు

భారత్‌కు అవసరమైన ముడిచమురు, గ్యాస్, ఎరువులు వంటివి పెద్ద మొత్తంలో హార్మూజ్ జలసంధి నుంచే వస్తాయని ప్రధాని మోదీ గుర్తుచేశారు. యుద్ధం కారణంగా ఈ మార్గంలో నౌకల రాకపోకలు సవాలుగా మారాయని అన్నారు. "అయినప్పటికీ, పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడకుండా మా ప్రభుత్వం ప్రయత్నాలు చేసింది" అని ఆయన వివరించారు. దేశం తన ఎల్పీజీ అవసరాల్లో 60 శాతం దిగుమతి చేసుకుంటున్నందున, సరఫరాలో అనిశ్చితిని దృష్టిలో ఉంచుకుని దేశీయ వినియోగదారులకే తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.

2లో..

## రాజకీయ ధురంధరుడు

# చంద్రబాబు వల్లే పెట్టుబడులు

**- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**




అమరావతి (ప్రశ్న న్యూస్) 'రాష్ట్రం బలంగా ఉండాలి, పెట్టుబడులు రావాలి అని. అలా ఉండాలంటే దార్శనికత ఉన్న వ్యక్తి రావాలి. నాపై అభిమానం ఉన్నా, నాకు అనుభవం లేదు. అనకాపల్లికి మిట్టల్ వంటి వారిని తీసుకరావాలంటే దార్శనికత ఉన్న చంద్రబాబుతోనే సాధ్యం' అని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు.అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద రాజయ్యపేటలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా సంస్థ భూమి పూజ కార్యక్రమానికి హాజరైన ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్రానికి భారీ పెట్టుబడులు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడితో, లక్ష మందికి ఉపాధి కల్పించే ఈ ప్రాజెక్టును మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా సంయుక్త భాగస్వామ్యంతో దేశంలోనే అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్‌ను మన రాష్ట్రంలో ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది. దీని ద్వారా ఏటా 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తి

2లో..

## స్టీల్ ప్లాంట్ కాదు..

# కాబోయే స్టీల్ సిటీ

**- మిట్టల్ పరిశ్రమ శంకుస్థాపనలో సీఎం చంద్రబాబు**







అమరావతి (ప్రశ్న న్యూస్) చంద్రబాబు అనే నేను చెబుతున్నా.. పరిశ్రమల స్థాపనకు దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అత్యంత అనుకూలమైన ప్రాంతం అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. సోమవారం అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ ఇండియా ప్లాంట్‌కు ఆయన ఘనంగా శంకుస్థాపన చేశారు. ఇది కేవలం ఒక స్టీల్ ప్లాంట్ మాత్రమే కాదని, రాబోయే రోజుల్లో ఇక్కడ ఒక పూర్తిస్థాయి స్టీల్ సిటీ ఆవిర్భవించబోతోందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

### ఉత్తరాంధ్ర తలరాత మార్చే మెగా ప్రాజెక్ట్

సుమారు రూ.1.35 లక్షల కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు కానున్న ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా ఒక లక్ష మందికి పైగా యువతకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. రెండు దశల్లో నిర్మితమయ్యే ఈ ప్లాంట్ ద్వారా ఏడాదికి 17.8 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి

2లో..

## రేవంత్ రెడ్డిని

# ముఖ్యమంత్రిని చేసింది నేనే

**- మాజీ మంత్రి మల్లారెడ్డి**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తనదైన శైలిలో మరోసారి సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. పాలిటిక్స్ నుంచి సినిమాల వరకు మల్లారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డితో తనకున్న అనుబంధంపై మల్లారెడ్డి చేసిన కామెంట్స్ రాజకీయ

2లో..

## ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేలా

# ఎలివేటెడ్ కారిడార్లు, మెట్రో విస్తరణ

**- సీఎం రేవంత్ రెడ్డి భారీ రోడ్డు మ్యాప్**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ శరవేగంగా విస్తరిస్తోంది. పెరిగిన జనాభా, ఆదాయ మార్గాల మెరుగుదలతో ప్రతి ఇంట్లో కార్ల సంఖ్య పెరగడం నగరంలో ట్రాఫిక్ సమస్యను జటిలం చేస్తోంది. ఈ పరిస్థితుల్లో హైదరాబాద్‌ను ఒక అద్భుతమైన నగరంగా తీర్చిదిద్దేందుకు, ట్రాఫిక్ రద్దీని శాశ్వతంగా పరిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఒక బృహత్తరమైన వ్యూహాన్ని ప్రకటించింది. కేవలం రోడ్ల విస్తరణకే కాకుండా ఎలివేటెడ్

2లో..

## డిజిటల్ మార్కెటింగ్ పేరుతో

# రూ.వేల కోట్ల మోసాలు

**- క్యూనెట్ సంస్థకు చెందిన 32 మంది అరెస్ట్**

- అరెస్టైన 32 మందిలో 11 మంది మహిళలు
- నిందితుల నుంచి ఒప్పంద పత్రాలు, ల్యాప్‌టాప్‌లు స్వాధీనం
- 30 టీమ్‌లతో కేసును ఛేదించినట్లు వెల్లడి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మరో భారీ మల్టీ లెవల్ డిజిటల్ మార్కెటింగ్ మోసాల ముఠాను పోలీసులు గుట్టురట్టు చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో గత కొన్నేళ్లుగా సాగుతున్న ఈ మోసాల చిట్టా ఎట్టకేలకు బయటికి వచ్చింది. మల్టీ లెవల్ డిజిటల్ మార్కెటింగ్ పేరుతో క్యూనెట్ సంస్థ పాల్పడుతున్న అక్రమాలపై హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులు ఏక కాలంలో పక్కా ప్లాన్ ప్రకారం దాడులు చేసి నిందితులను పట్టుకున్నారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ఒకేసారి దాడులు

3లో..

## ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతిలో

# భారీ స్కాం

**- కాకినాడ పోర్టులో బియ్యం ముక్కిపోయిందన్న హరీష్ రావు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి చేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడిందని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. సీబీఐ, ఈడీ కేసుల్లో నిందితుడిగా ఉన్న ప్రేమ్ చంద్ గార్గ్ అనే వ్యక్తిని ఈ ఎగుమతులకు అడ్వైజర్‌గా నియమించుకోవడంపై ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. పది లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతి చేస్తామని గొప్పగా ఎంవోయూ చేసుకున్న ప్రభుత్వం, కేవలం 22,750 టన్నుల వద్దే ఎందుకు ఆగిపోయిందని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో వాటాలు తేలకపోవడం వల్లే ఎగుమతులు నిలిచిపోయాయని ఆయన విమర్శించారు.

### కాకినాడ పోర్టులో ముక్కిపోయిన బియ్యం

సుమారు ఏడాది కాలంగా 7,500 టన్నుల బియ్యం కాకినాడ పోర్టులోనే ఉండిపోయాయని, అవి పురుగులు పట్టి ముక్కిపోతున్నాయని హరీశ్ రావు సభ దృష్టికి తెచ్చారు. ఇంతటి నష్టం జరుగుతున్నా ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందో సమాధానం చెప్పాలన్నారు. సివిల్ సప్లై శాఖలో జరిగిన ఈ అక్రమాలపై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేస్తూ, ఆధారాలతో సహా అన్ని నిరూపిస్తామని సవాల్ విసిరారు. భవిష్యత్తులో తాము అధికారంలోకి రావడం ఖాయమని, అప్పుడు ఈ

3లో..

## ఇరాన్‌తో యుద్ధాన్ని

# తాత్కాలికంగా ఆపేస్తున్నాం

**- డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన**



**న్యూయార్క్ (ప్రశ్న న్యూస్)** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా చేసిన ఒక సంచలన ప్రకటన పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలను తాత్కాలికంగా తొలగించింది. ఇరాన్‌తో నెలకొన్న శత్రుత్వానికి పూర్తిస్థాయిలో ముగింపు

2లో..

## తల్లిదండ్రులను చూడని

# ఉద్యోగుల జీతంలో కోత

**- కీలక బిల్లులకు కేబినెట్ ఆమోదం**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)(సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం సాయంత్రం సమావేశమైన తెలంగాణ మంత్రివర్గం పలు కీలక బిల్లులను ఆమోదించింది. రాష్ట్రంలో సామాజిక భద్రత శాంతి భద్రతలను పరిరక్షించడమే లక్ష్యంగా కొన్ని బిల్లులకు ఆమోదం తెలిపింది. తెలంగాణ కేబినెట్ ఆమోదించిన ఈ బిల్లుల్లో గత కొన్ని రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతున్న గిగ్ వర్కర్ల సంక్షేమానికి సంబంధించిన బిల్లు ఉంది. అదే సమయంలో తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత కుమారులకు ఉంటుందని అలా చూసుకోని వారికి వారి జీతాల్లో నుంచి కొంత మొత్తాన్ని తీసి

2లో..

# హైదరాబాద్‌ను మూడు ప్రత్యేక జోన్లుగా విభజిస్తున్నాం

బాటిల్ నెక్‌గా మారింది. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి రక్షణ శాఖ నుంచి 153 ఎకరాలు సేకరించాం. రక్షణ శాఖకు భూమికి బదులుగా భూమి కేటాయించాం'అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

### బేగంపేట వద్ద అండర్ టన్నెల్ నిర్మాణం

'దేశంలో ఎక్కడా లేని విధంగా బేగంపేట ఎయిర్‌పోర్ట్ రన్‌వే కింద నుంచి ఉత్తర తెలంగాణ వైపు వెళ్లే ప్రయాణికుల ఇబ్బందులు తొలగించడానికి అండర్ టన్నెల్ నిర్మాణానికి అనుమతి తీసుకున్నాం. పనులు కొనసాగుతున్నాయి. నల్గొండ వైపు వెళ్లే వారికి బాటిల్ నెక్‌గా మారిన నల్గొండ చౌరస్తా జంక్షన్ వద్ద ఎలివేటెడ్ కారిడార్ జూన్, జూలై నాటికి అందుబాటులోకి రానుంది'అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 'బాటిల్ నెక్స్‌ను తొలగించి నిరంతర ప్రయాణానికి 29 ప్రాంతాల్లో అండర్ పాస్, సర్ఫేస్ రోడ్స్, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, పంజాగుట్ట చౌరస్తా తదితర ప్రాంతాల నుంచి ఎయిర్ పోర్టుకు వెళ్లాలంటే ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కమాండ్ కంట్రోల్ సెంటర్ రోడ్, ఎమ్మెల్యే కాలనీ, దుర్గం చెరువు, రామానాయుడు స్టూడియో, హైకోర్టు జడ్జెస్ క్వార్టర్స్, మహాప్రస్థానం, కోహినూర్ హోటల్ నుంచి రాయదుర్గం నాలెడ్జ్ పార్క్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మించి దానిని పీవీ ఎక్స్‌ప్రెస్ వేకు అనుసంధానం చేయాలన్న ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయి'అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

### శంషాబాద్ వరకు మెట్రోను పొడగిస్తున్నాం

'హైదరాబాద్ మెట్రో ప్రారంభమైనప్పుడు దేశంలోనే రెండో స్థానంలో ఉండగా, గత దశాబ్దకాలం ఎలాంటి విస్తరణ కార్యక్రమాలు చేపట్టకపోవడంతో 9వ స్థానంలోకి పడిపోయాం. హైదరాబాద్ నగరానికి ఎక్కడి నుంచి అయితే ట్రాఫిక్ ప్రారంభమయ్యే హయత్‌నగర్, రామచంద్రాపురం లాంటి లాస్ట్‌మైల్ కనెక్టివిటీ ప్రాంతాలకు మెట్రో విస్తరించాల్సిన అవసరం ఉంది'అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. 'మెట్రో పనులను విస్తరించాలని భావించినప్పుడు ఎల్ అండ్ టీ సంస్థ ఈ వ్యాపారం నుంచి తప్పుకున్నామని ప్రకటించిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు మెట్రోను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించింది. ఎల్బీనగర్ వద్ద మెట్రో ఆగిపోయింది. హైదరాబాద్‌కు ట్రాఫిక్ ప్రారంభమయ్యే హయత్‌నగర్ వరకు మెట్రోను విస్తరించాలి. అంతర్జాతీయ విమానాశ్రయానికి మెట్రో కనెక్టివిటీ లేదు. అందుకే నాగోల్, ఎల్బీనగర్, ఓవైసీ హాస్పిటల్, చాంద్రాయగుట్ట, రాజేంద్రనగర్ మీదుగా శంషాబాద్ వరకు మెట్రోను పొడగిస్తున్నాం'అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

### రీజినల్ రింగ్ రోడ్డుకు ఓఆర్ఆర్‌కు మధ్యన రేడియల్ రోడ్లు

'గౌలిగూడ వద్ద ఆగిపోయిన మెట్రో పనులను పునరుద్ధరించి ఫలక్‌నుమా, చాంద్రాయగుట్ట జంక్షన్‌కు కనెక్ట్ చేస్తున్నాం. లక్షలాది మంది ఐటీ ఉద్యోగులు పనిచేస్తున్న ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నియోపోలిస్ వరకు పొడగించాల్సి ఉంది. బీహెచ్ఈఎల్, రామచంద్రాపురం నుంచి అత్యధిక ట్రాఫిక్ ఉంటుంది. చందానగర్ వరకు, నియోపోలిస్ కనెక్ట్ చేస్తూ విస్తరించాల్సి ఉంది'అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 'నగరంలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించడం వల్ల కూడా పాదచారులకు అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ట్రాఫిక్ సమస్యలేర్పడుతున్నాయి. చిరు వ్యాపారులకు కొంత కష్టమైనప్పటికీ ప్రయాణికులకు ఇబ్బంది కలిగించకుండా ఆపరేషన్ రోప్ పేరుతో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగిస్తున్నాం. పార్కింగ్ కూడా అతిపెద్ద సమస్యగా మారింది. అందుకే కేబీఆర్ పార్క్, నాంపల్లి తదితర ప్రాంతాల్లో మల్టిలెవల్ కార్ పార్కింగ్ ఏర్పాటు చేశాం. 360 కి.మీ మేరకు విస్తరించి ఉండే రీజినల్ రింగ్ రోడ్డుకు ఓఆర్ఆర్‌కు మధ్యన రేడియల్ రోడ్లను చేపట్టాం'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

### 4 పోలీస్ కమిషనరేట్లు ఏర్పాటు చేశాం

'మూసీ పునరుజ్జీవంలో భాగంగా హిమాయత్ సాగర్ జంక్షన్ నుంచి మూసీ వెంట గౌరవెల్లి వరకు గౌలిగూడ, చాదర్‌ఘాట్, అంబర్‌పేట, నాగోల్ జంక్షన్లలో ట్రంపెట్లను ఏర్పాటు చేస్తూ ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తాం.

ఈ కారిడార్ వల్ల హిమాయత్‌సాగర్ నుంచి గౌరవెల్లి వరకు 43 కి.మీ మేరకు ఎలివేటెడ్ కారిడార్‌తో ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయి'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఈ రకంగా 783 చ.కి.మీ మేర విస్తరించి ఉన్న కోర్ అర్బన్ రీజియన్ క్యూర్ ప్రాంత సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశాం. పరిపాలనా సౌలభ్యం కోసం హైదరాబాద్, సైబరాబాద్, మేడ్చల్ కార్పొరేషన్స్‌ను, 4 పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేశాం.." అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు.

# రాజకీయ ధురంధరుడు చంద్రబాబు వల్లే పెట్టుబడులు

అవుతుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి లభించడం అనేది ఈ ప్రాంత యువతకు గొప్ప వరం అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

### ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్ పెట్టుబడులు మాలో విశ్వాసాన్ని పెంచింది

'స్టీల్‌ప్లాంట్ భూమిపూజలో పాల్గొనడం సంతోషంగా ఉంది. ఏపీలో పెట్టుబడులు పెడుతున్న స్టీల్ ప్లాంట్ ప్రతినిధులకు ధన్యవాదాలు. స్టీల్‌ప్లాంట్ ద్వారా లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఉత్తరాంధ్ర ప్రజలకు అధికంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్ పెట్టుబడులు మాలో విశ్వాసాన్ని పెంచింది'అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

### చంద్రబాబు వల్లే ఏపీకి పెట్టుబడులు

'పెట్టుబడులు రావాలంటే దార్శనికత ఉన్న నేత కావాలని ఎన్నికల్లో చెప్పాను. లక్ష్మీమిట్టల్‌ను ఒప్పించి పెట్టుబడులు తీసుకురావాలంటే చంద్రబాబు వల్లే సాధ్యం. రాజకీయ ధురంధరుడు చంద్రబాబు వల్లే పెట్టుబడులు వస్తున్నాయి'అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 'ఏపీకి పెట్టుబడులు వస్తున్నాయంటే చంద్రబాబే కారణమని అమిత్‌షా చెప్పారు. దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కాబోతుంది. అత్యాధునిక సాంకేతికతతో గ్రీన్‌ఫీల్డ్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కాబోతుంది. అనంతపురంలో కియా పరిశ్రమ ద్వారా ఆ ప్రాంత రూపురేఖలే మారిపోయాయి. ఆర్సెలార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్ ద్వారా ఈ ప్రాంత దిశాదశ మారుతుంది'అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు.

### పర్యావరణ పరిరక్షణ చాలా ముఖ్యం

'ఆంధ్రప్రదేశ్‌పై, మా ఎన్డీయే ప్రభుత్వంపై నమ్మకం ఉంచి ఇంత భారీ పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చినందుకు ఆర్సెలర్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీ మిట్టల్, ఏఎంఎన్ఎస్ ఇండియా ఛైర్మన్ ఆదిత్య మిట్టల్, సీఈఓ దిలీప్ ఉమెన్‌లకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను'అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. 'పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యం. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి కర్బన ఉద్గారాలను (కార్బన్ ఫుట్‌ప్రింట్) పరిమితం చేసేలా ఈ ప్లాంట్‌ను నిర్మిస్తున్నారని తెలుసుకోవడం నాకు చాలా ఆనందంగా ఉంది. పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉన్న సంస్థలను మేం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తాం'అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వివరించారు.

# స్టీల్ ప్లాంట్ కాదు.. కాబోయే స్టీల్ సిటీ

కానుంది. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల్లోనే ఇంతటి భారీ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసుకోవడం మన స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కు నిదర్శనం" అని సీఎం పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రూ.11,198 కోట్లతో క్యాప్టివ్ పోర్టును కూడా నిర్మిస్తున్నారు.

### 2028 నాటికి తొలి దశ ఉత్పత్తి

ఈ ప్లాంట్‌కు సంబంధించి పక్కా కాలపరిమితిని ముఖ్యమంత్రి వెల్లడించారు. 2028 నాటికి మొదటి దశ ఉత్పత్తి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2030 డిసెంబర్ నాటికి రెండు బ్లాస్ట్ ఫర్నేస్ల నిర్మాణం పూర్తి కానుంది. పరిశ్రమకు అవసరమైన ముడి ఇనుము సరఫరా కోసం పైప్‌లైన్ వేయాలని ప్రధాని మోదీని కోరగా, ఆయన తక్షణమే అంగీకరించారని చంద్రబాబు తెలిపారు. అలాగే, జాతీయ రహదారిని అనుసంధానిస్తూ 4 లేన్ల రోడ్డును కూడా నిర్మిస్తున్నట్లు చెప్పారు.

### యువతకు నైపుణ్యం - స్థానికులకే ప్రాధాన్యత

పరిశ్రమ స్థాపనతో పాటు స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం రెండు కీలక ఒప్పందాలు చేసుకుంది. పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా యువతకు ట్రైనింగ్ ఇవ్వడం. అత్యాధునిక మెటలర్జికల్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా తయారీ రంగంలో మెళకువలు నేర్పించడం. ముఖ్యంగా అనకాపల్లి జిల్లా యువతకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం కోరారు. భూములిచ్చిన రైతుల త్యాగాలను స్మరిస్తూ, వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

### డబుల్ ఇంజన్ సర్కార్ విజయం

ఈ ప్రాజెక్ట్ సాకారం కావడంలో ప్రధాని నరేంద్ర మోదీ సహకారం మరువలేనిదని చంద్రబాబు కొనియాడారు. మోదీ విజన్ అయిన చిప్ టు షిప్ తయారీ విధానానికి ఏపీ సరైన వేదిక అని ఆయన అన్నారు. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అందిస్తామని తాను మరియు పవన్ కళ్యాణ్ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నామని చెప్పారు. మంత్రి నారా లోకేష్ పరిశ్రమల వేటలో చేస్తున్న కృషిని కూడా సీఎం అభినందించారు. అంతకుముందు ప్లాంట్ నమూనాను ముఖ్యమంత్రి, ఇతర నేతలు ఆసక్తిగా తిలకించారు.

# పశ్చిమాసియా సంక్షోభం భారత్‌కు ఊహించని సవాళ్లు

అదే సమయంలో దేశీయంగా ఎల్పీజీ ఉత్పత్తిని కూడా పెంచుతున్నట్లు చెప్పారు.

### వ్యూహాత్మక చర్యలతో పెరిగిన ఇంధన భద్రత

గత 11 ఏళ్లలో ఇంధన భద్రత కోసం తమ ప్రభుత్వం తీసుకున్న వ్యూహాత్మక చర్యలను ప్రధాని మోదీ వివరించారు. గతంలో కేవలం 27 దేశాల నుంచి ముడి చమురు, ఎల్ఎన్‌జీ, ఎల్పీజీ వంటివి దిగుమతి చేసుకోగా, నేడు 41 దేశాల నుంచి దిగుమతి చేసుకునే స్థాయికి చేరామని తెలిపారు. సంక్షోభ సమయాల కోసం ముడి చమురు నిల్వలకు ప్రాధాన్యత ఇచ్చామని, ప్రస్తుతం దేశంలో 53 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు ఉన్నాయని వెల్లడించారు. దీనిని 64 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా పెంచేందుకు పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఇవి కాకుండా ఆయిల్ కంపెనీల వద్ద ఉండే నిల్వలు అదనమని అన్నారు. చమురు, గ్యాస్ సరఫరాలు నిరంతరాయంగా కొనసాగేలా వివిధ దేశాలతో ప్రభుత్వం నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని, గల్ఫ్, ఇతర సముద్ర మార్గాలను నిశితంగా గమనిస్తున్నామని మోదీ పేర్కొన్నారు.

### పరిస్థితులు ఆందోళనకంగా ఉన్నాయి

పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని ప్రధాని మోదీ అన్నారు. ఈ సంక్షోభం భారత్‌కు ఆర్థిక, జాతీయ భద్రత, మానవతా పరమైన సవాళ్లను సృష్టిస్తోందని వివరించారు. "యుద్ధంలో చిక్కుకున్న దేశాలతో, దాని ప్రభావానికి గురైన దేశాలతో భారత్‌కు విస్తృతమైన వాణిజ్య సంబంధాలు ఉన్నాయి. మనకు అవసరమైన ముడి చమురు, గ్యాస్‌లో సింహభాగం ఈ ప్రాంతం నుంచే దిగుమతి అవుతోంది. ఇతర దేశాలతో మన వాణిజ్యానికి ఈ ప్రాంతం ఒక ముఖ్యమైన మార్గం కూడా. అందువల్ల, ఈ యుద్ధం మనపై తీవ్ర ప్రభావం చూపుతోంది" అని మోదీ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో సుమారు కోటి మంది భారతీయులు నివసిస్తూ, పనిచేస్తున్నారని, అలాగే వాణిజ్య నౌకల్లో పనిచేసే భారత సిబ్బంది సంఖ్య కూడా చాలా ఎక్కువని, ఈ కారణాల వల్ల భారత్ ఆందోళన సహజంగానే ఎక్కువగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

### ప్రవాస భారతీయుల భద్రతే మా ప్రథమ ప్రాధాన్యం

సంక్షోభ ప్రాంతాల్లోని భారతీయుల భద్రత, సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. "యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ప్రభావిత దేశాల్లోని ప్రతి భారతీయుడికి అవసరమైన సహాయాన్ని అందిస్తున్నాం. నేను స్వయంగా రెండు దఫాలుగా చాలా పశ్చిమాసియా దేశాల అధినేతలతో ఫోన్‌లో మాట్లాడాను. భారతీయులకు పూర్తి భద్రత కల్పిస్తామని వారంతా హామీ ఇచ్చారు" అని తెలిపారు. దురదృష్టవశాత్తు కొందరు ప్రాణాలు కోల్పోయారని, మరికొందరు గాయపడ్డారని చెబుతూ, వారి కుటుంబాలకు అవసరమైన మద్దతు అందిస్తున్నామని, గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందేలా చూస్తున్నామని వివరించారు.

ఇప్పటికే 3,75,000 మందికి పైగా భారతీయులు సురక్షితంగా స్వదేశానికి తిరిగి వచ్చారని, ఒక్క ఇరాన్ నుంచే 700 మంది మెడికల్ విద్యార్థులతో సహా వెయ్యి మంది వచ్చారని తెలిపారు. గల్ఫ్ దేశాల్లోని భారతీయ పాఠశాలల్లో 10, 12వ తరగతి పరీక్షలను సీబీఎస్ఈ రద్దు చేసిందని, విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

### రైతులపై ప్రభావం పడకుండా చర్యలు

పశ్చిమాసియా సంక్షోభం రైతులపై ప్రభావం చూపకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని ప్రధాని మోదీ భరోసా ఇచ్చారు. "రైతులకు అవసరమైన ఎరువుల నిల్వలు దేశంలో పుష్కలంగా ఉన్నాయి.

ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు వేయడానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తాం. గత కొన్నేళ్లుగా మేం తీసుకున్న చర్యల వల్ల వివిధ మార్గాల్లో ఎరువుల దిగుమతి సాధ్యమైంది. రైతులకు 'మేక్ ఇన్ ఇండియా' ఎరువుల ప్రత్యామ్నాయాన్ని కూడా ఇచ్చాం" అని ఆయన వివరించారు. డీజిల్‌పై ఆధారపడటాన్ని తగ్గించేందుకు రైతులకు 22 లక్షలకు పైగా సోలార్ పంపులను అందజేసినట్లు గుర్తుచేశారు.

### ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే ప్రత్యామ్నాయాలు

ఇలాంటి క్లిష్ట సమయాల్లో ఇథనాల్ బ్లెండింగ్‌పై భారత్ దృష్టి సారించడం సత్ఫలితాలనిస్తోందని ప్రధాని మోదీ తెలిపారు. "ఇథనాల్ బ్లెండింగ్ కారణంగా మనం ఇప్పుడు ఏటా 4.5 కోట్ల బ్యారెళ్ల చమురు దిగుమతిని ఆదా చేస్తున్నాం" అని వెల్లడించారు. ప్రత్యామ్నాయ ఇంధనాలపై దృష్టిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వాలకు 15,000 ఈ-బస్సులను అందజేశామని తెలిపారు.

పశ్చిమాసియా ఇంధన అవసరాలకు ప్రధాన వనరు అయినప్పటికీ, అక్కడి అంతరాయాల ప్రభావాన్ని తగ్గించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, భారత ఆర్థిక వ్యవస్థ పునాదులు చాలా బలంగా ఉన్నాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రసాయనాలు, ఫార్మా, పెట్రోకెమికల్స్ వంటి రంగాలకు అవసరమైన దిగుమతుల కోసం ప్రత్యామ్నాయ వనరులను అన్వేషిస్తున్నట్లు, అలాగే భారతీయ వస్తువులను ప్రోత్సహించడానికి కొత్త ఎగుమతి మార్గాలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

# ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేలా

# ఎలివేటెడ్ కారిడార్లు, మెట్రో విస్తరణ

కారిడార్లు, మెట్రో రెండో దశ విస్తరణ, మూసీ సుందరీకరణ వంటి ప్రణాళికలతో నగర రూపురేఖలు మార్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక స్పష్టమైన రోడ్డు మ్యాప్‌ను శాసన మండలి వేదికగా వివరించారు.

### ట్రాఫిక్ నియంత్రణకు బిగ్ ప్లాన్

హైదరాబాద్ నగర అభివృద్ధిని ప్రభుత్వం మూడు కీలక విభాగాలుగా వర్గీకరించింది. అవే క్యూర్, ప్యూర్, రేర్, 783 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న కోర్ అర్బన్ రీజియన్‌ను క్యూర్‌గా పరిగణిస్తున్నారు. ఇక్కడ సర్వీస్ సెక్టార్‌పై దృష్టి సారించనున్నారు. ప్యూర్ విభాగంలో ఇండస్ట్రియల్ సెక్టార్, రేర్ విభాగంలో అగ్రికల్చరల్ సెక్టార్‌ను అభివృద్ధి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ముఖ్యంగా కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్డు వెలుపలకి తరలించి, నగరాన్ని నివాసయోగ్యంగా మార్చాలని నిర్ణయించారు. పరిపాలనా సౌలభ్యం కోసం హైదరాబాద్, సైబరాబాద్, మేడ్చల్ కార్పొరేషన్లు, నాలుగు పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేసినట్టు సీఎం తెలిపారు.

### నలువైపులా ఎలివేటెడ్ కారిడార్లు- సిగ్నల్ లేని ప్రయాణం

నగరం నడిబొడ్డు నుంచి శివార్ల వరకు వెళ్లే ప్రయాణికులకు ట్రాఫిక్ నరం నుంచి విముక్తి కలిగించడానికి నాలుగు ప్రధాన జంక్షన్ల వద్ద ఎలివేటెడ్ కారిడార్లు నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. గౌలిగూడ జంక్షన్, చాదర్ ఘాట్ జంక్షన్, నాగోల్, అంబర్‌పేట జంక్షన్‌లో ఈ కారిడార్‌లను నిర్మిస్తారు. ఈ ప్రాజెక్టుల వల్ల భూసేకరణ భారం తక్కువగా ఉండటమే కాకుండా వాహనదారులు సిగ్నల్స్ వద్ద ఆగకుండా నేరుగా నగరం వెలుపలకి చేరుకోవచ్చు. ముఖ్యంగా మూసీ రిజువెనేషన్ ప్రాజెక్టులో భాగంగా హిమాయత్ సాగర్ జంక్షన్ నుంచి మూసీ నది వెంట గౌరవెల్లి వరకు సుమారు 43 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించనున్నారు. ఈ మార్గంలో గౌలిగూడ, చాదర్ ఘాట్, అంబర్‌పేట, నాగోల్ జంక్షన్ వద్ద ట్రంపెట్లను ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్యలు లేకుండా చేస్తారు. నల్గొండ వైపు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందిగా మారిన నల్గొండ చౌరస్తా జంక్షన్ వద్ద ఎలివేటెడ్ కారిడార్ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇది జూన్ లేదా జులై నాటికి అందుబాటులోకి వస్తుంది.

### మెట్రో రైలు రెండో దశ

హైదరాబాద్ మెట్రో ఒకప్పుడు దేశంలోనే రెండో స్థానంలో ఉండగా, గత దశాబ్ద కాలంలో విస్తరణ జరగకపోవడంతో అది తొమ్మిదో స్థానానికి పడిపోయింది. దీనిని అధిగమించేందుకు ప్రభుత్వం 24వేల కోట్లతో మెట్రో రెండో దశను 76 కిలోమీటర్ల మేర విస్తరించాలని ప్రతిపాదించింది. లాస్ట్ మైల్ కనెక్టివిటీ లక్ష్యంగా చేసుకొని, విమానాశ్రయానికి మెట్రో అనుసంధానం చేసున్నారు. నాగోల్, ఎల్బీనగర్ ఓవైసీ హాస్పిటల్, చాంద్రాయగుట్ట, రాజేంద్రనగర్ మీదుగా శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రో లైన్ పొడిగిస్తారు.పాతబస్తీ ప్రజల చిరకాల కోరిక మేరకు గౌలిగూడ వద్ద ఆగిపోయిన మెట్రో పనులను పునరుద్ధరించి ఫలక్‌నుమా, చాంద్రాయగుట్ట జంక్షన్ కనెక్ట్ చేయనున్నారు అలాగే ఐటీ ఉద్యోగుల కోసం ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నియోపోలిస్ వరకు, బీహెచ్ఈఎల్, రామచంద్రాపురం నుంచి చందానగర్ వరకు మెట్రోను విస్తరించనున్నారు.

# తల్లిదండ్రులను చూడని ఉద్యోగుల జీతంలో కోత

వారి తల్లిదండ్రులకు ఇవ్వనున్నట్లు ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి చెప్పగా దానికి సంబంధించిన బిల్లుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

### తల్లిదండ్రుల సంరక్షణ బిల్లు

రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించి ఈ వినూత్న బిల్లును ప్రవేశపెట్టింది. వయసు మీదపడి వృద్ధాప్యంలో అనారోగ్యంతో బాధపడుతున్న తల్లిదండ్రుల బాధ్యతను తీసుకోని ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులతోపాటు ప్రజాప్రతినిధుల వేతనాల నుంచి 15 శాతం లేదా రూ.10 వేలను, ఇందులో ఏది తక్కువగా ఉంటే అది కట్ చేసి వాటిని నేరుగా తల్లిదండ్రులకు అందించేందుకు ఉద్దేశించిన బిల్లును రూపొందించగా తాజాగా అది కేబినెట్ ఆమోదం పొందింది.

### గిగ్ వర్కర్ల సంక్షేమానికి హామీ

తెలంగాణలో సుమారు 4.2 లక్షల మంది గిగ్ వర్కర్లు, ప్లాట్‌ఫామ్ కార్మికులు (డెలివరీ బాయ్స్, డ్రైవర్లు) ఉన్నారు. ఈ గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం తెలంగాణ ప్లాట్‌ఫామ్ బేస్డ్ గిగ్ వర్కర్స్ యాక్ట్ 2026ను తెలంగాణ మంత్రివర్గం ఆమోదించింది. దీని ప్రకారం గిగ్ వర్కర్ల రిజిస్ట్రేషన్‌తోపాటు ఒక ప్రత్యేక వెల్ఫేర్ బోర్డు, సంక్షేమ నిధిని ఏర్పాటు చేయనున్నారు. ఇలా చేయడం వల్ల గిగ్ వర్కర్లకు చట్టబద్ధమైన గుర్తింపుతో పాటు సామాజిక భద్రత కూడా లభిస్తుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

### విద్వేష ప్రసంగాలను అడ్డుకునే బిల్లు

తెలంగాణ రాష్ట్రంలో మత సామరస్యాన్ని కాపాడేందుకు అదే సమయంలో సోషల్ మీడియాలో పెరిగిపోతున్న విద్వేషపూరిత, రెచ్చగొట్టే పోస్టులను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన బిల్లును తీసుకువచ్చింది. తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్ ప్రివెన్షన్ బిల్లు 2026ను తాజాగా తెలంగాణ కేబినెట్ ఆమోదించింది. విద్వేషపూరితమైన ప్రసంగాలు, అల్లర్లను ప్రేరేపించే విధంగా చేసే వ్యాఖ్యలను కట్టడి చేసేందుకు ఈ బిల్లు ఒక శక్తివంతమైన ఆయుధంగా పనిచేయనుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. మతాల మధ్య కొంతమంది చిచ్చు పెట్టేందుకు చేసే ప్రయత్నాలను అడ్డుకోవడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశమని తెలిపాయి.

### హైదరాబాద్ మెట్రో రైలు స్వాధీనం

హైదరాబాద్‌లోని 69 కిలోమీటర్ల ఫేజ్-1 మెట్రో వ్యవస్థను ఎల్ అండ్ టీ సంస్థ నుంచి రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోనుంది. దీని కోసం రూ.15 వేల కోట్లను చెల్లించాలని సర్కార్ నిర్ణయించింది. ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకు నోడల్ ఏజెన్సీగా హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్)ను నియమించింది.

### లాయర్ల రక్షణ బిల్లు

రాష్ట్రంలో లాయర్లపై రోజురోజుకూ పెరుగుతున్న దాడులను అరికట్టేందుకు అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లును తీసుకువచ్చిన ప్రభుత్వం తాజాగా దానికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తెలంగాణలో సంచలనం సృష్టించిన హైకోర్టు న్యాయవాదులు వామనరావు దంపతుల హత్య వంటి ఘటనలు మళ్లీ జరగకుండా ఉండేందుకు న్యాయవాదులకు తగిన భద్రత కల్పించడమే ఈ బిల్లు ప్రధాన లక్ష్యం.

### కులగణన నివేదిక, రోహిత్ వేముల చట్టం

రాష్ట్రంలో నిర్వహించిన కులగణన సర్వేపై జస్టిస్ సుదర్శన్ రెడ్డి కమిటీ ఇచ్చిన రిపోర్టును రాష్ట్ర మంత్రివర్గం పరిశీలించింది. అదే సమయంలో విద్యాసంస్థల్లో కుల వివక్షను నివారించేందుకు రోహిత్ వేముల చట్టానికి సంబంధించిన విధివిధానాల రూపకల్పన కోసం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది.

# రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసింది నేనే

వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. అసెంబ్లీ వద్ద మీడియా చిట్‌చాట్‌లో మాజీ మంత్రి మల్లారెడ్డి ఈ సంచలన వ్యాఖ్యలు చేయడం గమనార్హం. రెడ్డి సంఘం మీటింగ్‌లో ఆనాడు తాను చేసిన వ్యాఖ్యలను మల్లారెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు

. రెడ్డి సామాజికవర్గంలో ప్రస్తుతం రేవంత్ రెడ్డి తప్ప మరో పవర్‌ఫుల్ నాయకుడు లేడని ఆనాడే తాను చెప్పానని ఆయన వెల్లడించారు. "రెడ్డి సంఘం మీటింగ్‌లో నేను స్పష్టంగా చెప్పాను, మన సామాజిక వర్గంలో రేవంత్ రెడ్డి అత్యంత శక్తివంతమైన నేత అని. ఆయనే ముఖ్యమంత్రి కావాలని కోరుకున్నాను, చివరకు అది నిజమైంది. ఒక రకంగా రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసింది నేనే" అని మల్లారెడ్డి వ్యాఖ్యానించారు.

### రేవంత్.. నేను అన్నదమ్ములమే

రాజకీయంగా విమర్శలు ఉన్నప్పటికీ రేవంత్ రెడ్డితో తనకున్న వ్యక్తిగత అనుబంధం గురించి మల్లారెడ్డి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు.

"ఎవరు అవునన్నా కాదన్నా నేను, రేవంత్ రెడ్డి అన్నదమ్ములమే. మా మధ్య మంచి సాన్నిహిత్యం ఉంది. రాజకీయాలు వేరు, బంధాలు వేరు" అని ఆయన స్పష్టం చేశారు. గతంలో రేవంత్ రెడ్డి మల్లారెడ్డి కాలేజీలపై జరిగిన దాడులు, భూ వివాదాల నేపథ్యంలో వీరిద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడు మల్లారెడ్డి రేవంత్‌ను తన సోదరుడిగా పేర్కొనడం చర్చనీయాంశమైంది.

### ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో విలన్ క్యారెక్టర్ నాదే

రాజకీయాలతో పాటు సినీ రంగంపై కూడా మల్లారెడ్డి తన మనసులోని మాటను బయటపెట్టారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, హరీష్ శంకర్ దర్శకత్వంలో విడుదలైన ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో తనకు విలన్ పాత్ర ఆఫర్ వచ్చిందని మల్లారెడ్డి వెల్లడించారు. " ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో విలన్ క్యారెక్టర్ నాదే, దర్శకుడు హరీష్ శంకర్ అడిగితే నేను నో చెప్పాను, సినిమాల్లో ముఖ్యమంత్రి పాత్ర చేయాలని ఉంది" అని మల్లారెడ్డి తెలిపారు.

### ముఖ్యమంత్రి పాత్ర చేయాలని ఉంది!

సినిమాల్లో నటించడంపై తనకు ఆసక్తి ఉందని, అయితే తనకు నచ్చిన పాత్ర వస్తేనే చేస్తానని మల్లారెడ్డి పేర్కొన్నారు. "నాకు సినిమాల్లో ముఖ్యమంత్రి పాత్ర చేయాలని ఉంది. రియల్ లైఫ్‌లో కాకపోయినా, రీల్ లైఫ్‌లోనైనా సీఎం హోదాలో కనిపించాలని ఆశపడుతున్నాను. అలాంటి పవర్‌ఫుల్ పాత్ర వస్తే తప్పకుండా నటిస్తాను" అని మల్లారెడ్డి తన కోరికను బయటపెట్టారు. మల్లారెడ్డి చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో హల్చల్ చేస్తున్నాయి. రేవంత్ రెడ్డి గురించి చేసిన వ్యాఖ్యలు రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

# ఇరాన్‌తో యుద్ధాన్ని తాత్కాలికంగా ఆపేస్తున్నాం

పలికే దిశగా గత రెండు రోజులుగా సాగుతున్న చర్చలు అత్యంత సానుకూల ఫలితాలను ఇచ్చాయని ఆయన వెల్లడించారు. అమెరికా, ఇరాన్ దేశాల మధ్య గత రెండు రోజులుగా జరుగుతున్న చర్చలు అత్యంత ఫలవంతంగా ఉన్నాయని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. పశ్చిమాసియాలో దశాబ్దాలుగా కొనసాగుతున్న శత్రుత్వానికి శాశ్వత పరిష్కారం కనుగొనే దిశగా ఇరు దేశాలు అడుగులు వేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ చర్చల సరళి, సానుకూల వాతావరణం ఆధారంగా, ఇరాన్ ఇంధన వనరులపై జరపాల్సిన దాడులను వాయిదా వేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఇరాన్‌లోని విద్యుత్ కేంద్రాలు , ఇంధన మౌలిక సదుపాయాలపై లక్ష్యంగా చేసుకున్న అన్ని రకాల సైనిక దాడులను ఐదు రోజుల పాటు నిలిపివేయాలని తాను రక్షణ శాఖను ఆదేశించినట్లు ట్రంప్ స్పష్టం చేశారు. ఈ ఐదు రోజుల గడువు ఇరు దేశాల మధ్య జరుగుతున్న చర్చల విజయవంతంపై ఆధారపడి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ప్రస్తుతానికి యుద్ధ వాతావరణం నుంచి చర్చల దిశగా అడుగులు పడటం అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. వచ్చే వారం పొడవునా ఈ నిర్మాణాత్మక చర్చలు కొనసాగుతాయని, ఇరు దేశాల మధ్య ఉన్న వివాదాలను లోతుగా విశ్లేషించి ఒక తుది ఒప్పందానికి రావడమే తమ లక్ష్యమని ట్రంప్ వివరించారు. ఈ చర్చలు సఫలమైతే పశ్చిమాసియాలో శాంతి నెలకొనే అవకాశం ఉందని దౌత్యవేత్తలు భావిస్తున్నారు. ట్రంప్ తనదైన శైలిలో క్యాపిటల్ లెటర్స్‌తో చేసిన ఈ సుదీర్ఘ పోస్ట్ ఇప్పుడు ప్రపంచ మార్కెట్లను, ముఖ్యంగా చమురు ధరలను ప్రభావితం చేసేలా ఉంది. మొత్తానికి యుద్ధం అంచున ఉన్న ఇరు దేశాల మధ్య శాంతి చర్చల వార్త ఊరటనిస్తోంది. అయితే, ఈ ఐదు రోజుల గడువు ముగిసిన తర్వాత ఇరాన్ వైఖరి ఎలా ఉంటుంది. అమెరికా తన తదుపరి అడుగును ఎలా వేస్తుందనేది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది. ట్రంప్ తీసుకున్న ఈ అనూహ్య నిర్ణయం వెనుక ఉన్న దౌత్యపరమైన వ్యూహాలపై ఇప్పుడు విశ్లేషణలు మొదలయ్యాయి.

# శ్రీనివాస ఆయుర్వేద ఫార్మసీని ఉత్తమ ప్రయోగశాలగా తీర్చిదిద్దాలి

**- జేఈవో డా. ఎ. శరత్**



తిరుపతి (ప్రశ్న న్యూస్ ) టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీనివాస ఆయుర్వేద ఫార్మసీని ఉత్తమమైన ప్రయోగశాలగా అభివృద్ధి చేయాలని టిటిడి జేఈవో (వైద్యం, విద్య) డా. ఎ. శరత్ అధికారులకు సూచించారు. సోమవారం శ్రీనివాస మంగాపురం సమీపంలోని నరసింగాపురంలో ఉన్న ఫార్మసీని ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫార్మసీ 19 ఎకరాల విస్తీర్ణంలో ఉందని తెలిపారు. ఇందులో సమగ్రంగా హెర్బల్ మెడిసిన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. రోగాలకు అవసరమైన మందులు, వాటికి అవసరమైన మొక్కలు, ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరులు, అలాగే బయట నుంచి తీసుకొస్తున్న ఔషధ మొక్కల వివరాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు.బయట నుంచి ఔషధ మొక్కలపై ఆధాపడే విధానాన్ని తగ్గించి, ఫార్మసీ భూమిలోనే ప్రణాళికాబద్ధంగా మొక్కలను పెంచి, అవసరమైన ముడి పదార్థాలను ఇక్కడే మరింత నాణ్యంగా ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఫార్మసీ భూమిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి, హెర్బల్ మెడిసిన్ ప్లాంట్‌గా అభివృద్ధి చేయాలని తెలిపారు.ప్రస్తుతం పెంచుతున్న మొక్కలు, బయట నుంచి తెచ్చే మొక్కల వివరాలు సేకరించి, వాటిని ఎంతవరకు తగ్గించవచ్చో ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఈ భూమిని ప్రయోగశాలలా అభివృద్ధి చేసి, ఆకులు, వేర్లు, చెక్కలు వంటి ఔషధ భాగాలకు అవసరమైన మొక్కలను ఇక్కడే పెంచేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.సమీక్ష అనంతరం ఫార్మసీలో తయారు చేస్తున్న ఉత్పత్తులను, యంత్రాల పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఏపీ ఔషధ, సుగంధ ద్రవ్యాల బోర్డు సీఈవో ఎ. చంద్రశేఖర్, ఫార్మసీ ఇన్‌చార్జ్ డా. రేణు దీక్షిత్, ఎస్.ఈ నరసింహ మూర్తి, డీఈ దామోదర్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దివ్య కాంతుల్లో అలరించిన కోదండరాముడి చంద్రప్రభ విహారం



తిరుపతి(ప్రశ్న న్యూస్) శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజు సోమవారం రాత్రి 7 గంటలకు స్వామివారు చంద్రప్రభ వాహనంపై భక్తులను అనుగ్రహించారు. ఆలయ నాలుగు మాడ వీధుల్లో వాహనసేవ వైభవంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. చంద్రప్రభ వాహనంపై స్వామిని చూడగానే భక్తుల మనసు ఉప్పొంగుతుంది. ఆధ్యాత్మిక, ఆదిభౌతిక, ఆది దైవికమనే మూడు తాపాలను నివారిస్తుంది. వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్, అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# దొమ్మేటి వెంకటరెడ్డి స్ఫూర్తితో శెట్టిబలిజ కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేద్దాం

**గూడెంలో ఘనంగా దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలు**





కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) కొత్తగూడెం మండల శెట్టిబలిజ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎస్సిబి నగర్ లోని శెట్టిబలిజ కార్యాలయంలో సామాజిక విప్లవకారుడు, శెట్టిబలిజ సంఘ స్థాపకుడు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు కడలి లేడీబాబు, చిరంజీవి లాయర్, దంగేటి సత్యనారాయణ, సత్యనారాయణ, కూడుపూడి సత్యనారాయణ, గుత్తుల సత్యనారాయణ, కోటేశ్వరరావు, అనిశెట్టి నారాయణ, వెంకట్ రమణ, మొల్లేటి రాము, కొండ రాయుడు నాగేశ్వరావు తదితర సంఘ పెద్దల మాట్లాడుతు కోనసీమలో అట్టడుగు వర్గాల విద్యాభివృద్ధికి, వారి ఆత్మగౌరవం కోసం పోరాడిన యోధుడు దొమ్మేటి వెంకటరెడ్డి అని, ఆయన పోరాటం స్ఫూర్తిగా తెలంగాణ రాష్ట్రంలో శెట్టిబలిజ కార్పొరేషన్ ఏర్పాటు కోసం పెద్ద ఎత్తున పోరాటం చేద్దామన్నారు. శెట్టి బలిజల పితామహుడిగా పేరుగాంచిన వెంకటరెడ్డి జయంతిని ఆంధ్రప్రదేశ్ లో రాష్ట్ర పండుగ నిర్వహిస్తుంటే మన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం శెట్టిబలిజలను మన నాయకుడిని పట్టించుకోని పరిస్థితి నెలకొందని విమర్శించారు. కోనసీమ ప్రాంతానికి చెందిన దొమ్మేటి వెంకటరెడ్డి శెట్టి బలిజ సమాజంలో విద్య, ఐక్యత, ఆత్మ గౌరవం కోసం విశేషంగా కృషి చేసిన గొప్ప సంస్కర్తని కొనియాడారు. విద్య ప్రాముఖ్యతను చాటిచెప్పి, సామాజిక చైతన్యానికి బాటలు వేశారన్నారు. కోనసీమలో అట్టడుగు వర్గాల విద్యాభివృద్ధికి, ఆత్మగౌరవం కోసం పోరాడిన యోధుడన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో వయోజన విద్యకు కృషి చేసిన మేధావి అని కొనియాడారు.

### శెట్టిబలిజ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

శెట్టిబలిజ కార్పొరేషన్ ఏర్పాటు చేసి 5వేల కోట్ల సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని, తెలంగాణలో శెట్టిబలిజలను తిరిగి బీసీల్లో చేర్చాలని గత బిఆర్ఎస్ ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించిన ఉపయోగం లేకుండా పోయిందని, రేవంత్ రెడ్డి సారధ్యంలో నైనా శెట్టిబలిజలకు న్యాయం జరగాలన్నారు. పార్టీలు, పదవులు శాశ్వతం కాదని, రాబోయే రోజుల్లో నైనా మన శెట్టిబలిజ బిడ్డలకు న్యాయం జరిగేలా ఐక్యతతో ముందుకు సాగాలని నాయకులకు పిలుపునిచ్చారు.

# ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవతో వేములవాడలో షాదీఖానా నిర్మాణానికి శ్రీకారం

**- రూ.80 లక్షలు మంజూరు**

**- వేములవాడ మున్సిపల్ చైర్మన్ : పుల్కం రాజు**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణంలో ముస్లిం మైనార్టీల కోసం షాదీఖానా నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.80 లక్షలు మంజూరు చేసింది. సోమవారం వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించి, ముస్లిం మైనార్టీ కమిటీ అధ్యక్షులు మహమ్మద్ అక్రమ్, మత పెద్దలతో చర్చించారు. ఈ సందర్భంగా పుల్కం రాజు మాట్లాడుతూ, ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఆధునిక వసతులతో షాదీఖానా నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరుణ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్ కొక్కుల బాలకృష్ణ, మైనార్టీ నాయకులు, మత పెద్దలు పాల్గొన్నారు.

# వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసే వారికి ఎల్లప్పుడూ నా మద్దతు

**తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఇరవత్రి అనిల్ కుమార్**



నిజామాబాద్(ప్రశ్న న్యూస్) గాంధీ భవన్‌లో జరిగిన ఓబీసీ డిపార్ట్మెంట్ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఇరవత్రి అనిల్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం మీరు చేసే పోరాటంలో నా పూర్తి మద్దతు ఎల్లప్పుడూ ఉంటుంది ఓబీసీ సెల్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కి అలాగే, కన్వీనర్లుగా బాధ్యతలు చేపట్టిన కేతూరి వెంకటేష్ కి ,డా. జూలూరు ధనలక్ష్మికి శుభాకాంక్షలు తెలిపారు.

# యువతలో దేశభక్తిని పెంపొందించాలి

**- జేఎన్టియు కళాశాల ప్రిన్సిపాల్ : వేణుగోపాల్**

**- భగత్ సింగ్ స్ఫూర్తితో పోటీలు నిర్వహించిన "మై భారత్"**


**- షహీద్ దివస్ సందర్భంగా జేఎన్‌టీసీ కళాశాలలో పోటీలు**



వేములవాడ (ప్రశ్న న్యూస్ ) మై భారత్ ఆధ్వర్యంలో వేములవాడ అర్బన్ మండలం,అగ్రహారం జేఎన్‌టీయు కళాశాలలో షహీద్ దివస్ సందర్భంగా విద్యార్థిని-విద్యార్థులకు ఎలక్ట్రిషన్,వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ మాట్లాడుతూ, నేడు మనం స్వేచ్ఛా వాయువులను పీలుస్తూ ఎలాంటి భయాందోళనలు లేకుండా జీవిస్తున్నామంటే, అది దేశ వీరుల త్యాగాల ఫలితమేనని తెలిపారు. ప్రతి సంవత్సరం మార్చి 23న జరుపుకునే షహీద్ దివస్, భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల మహా త్యాగాలను స్మరించుకునే దినమని గుర్తు చేశారు. 1931 మార్చి 23న లాహోర్ సెంట్రల్ జైలులో బ్రిటిష్ పాలకులు వీరిని ఉరితీయగా, కేవలం 23--24 ఏళ్ల వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేశారని వివరించారు.అనంతరం పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో మై భారత్ వాలంటీర్ గంగిపల్లి స్వామి కుమార్, అధ్యాపకులు శ్రావణ్, రాజేష్, పూసల సంతోష్, రజినీకాంత్, జెస్సు, అజీజ్ తదితరులు మరియు విద్యార్థిని-విద్యార్థులు పాల్గొన్నారు.

# కిష్టాపూర్ గ్రామంలో ఘనంగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన

**కిష్టాపూర్ బిజెపి నాయకులు**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో సోమవారం నాడు మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు జన్మదిన వేడుకలు కిష్టాపూర్ గ్రామ సర్పంచ్ సాదుల స్వప్న ఊశయ్య ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావుకు శ్రీ ఏడుపాయల వన దుర్గ భవాని అమ్మవారి ఆశీస్సులు వారిపై ఎల్లవేళలా ఉండాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు మరియు డిజె సప్పులతో కేక్ కట్ చేసి కిష్టాపురం గ్రామ ప్రజల తరఫున వారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు ఈ జన్మదిన కార్యక్రమంలో పాల్గొన్న కిష్టాపూర్ గ్రామ ఉపసర్పంచ్ చందపురం నిర్మల శేఖర్ యాదవ్, బిజెపి పార్టీ జిల్లా కౌన్సిల్ మెంబర్ ఎంచర్ల శేఖర్ యాదవ్, వార్డు మెంబర్స్ పసుల రేఖ యాదగిరి, అక్కే ప్రవీణ్ యాదవ్, మాజీ సర్పంచ్ యాదమ్మ మల్లేశం, బిజెపి పార్టీ సీనియర్ నాయకులు ఎంబరీ శేఖర్ యాదవ్, సాదుల సాయిరాజ్, ఎంబరీ శీను, అక్కే మహేందర్ , కిష్టాపూర్ బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్సెప్టర్ వాహనాన్ని ప్రారంభించిన పోలీస్ కమీషనర్



నిజామాబాద్(ప్రశ్న న్యూస్) నిజామాబాదు పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో ఇంటర్సెప్టర్ వాహనాన్ని నిజామాబాద్ పోలీస్ కమీషనర్ సాయి చైతన్య జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ ఈ వాహనం ద్వారా , ఆందోళనల సమయంలో శాంతిభద్రతల పర్యవేక్షణకు, నేరాల నియంత్రణకు ఉపయోగపడుతుందన్నారు.ఈ సందర్భంగా అదనపు డీసీపీ రామచంద్రరావు, నిజామాబాదు ఏసీపీ ప్రకాష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్స్ శేఖర్ బాబు, ధరణి కుమార్ , సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి రామన్ గౌడ్ సేవలు మరువలేనివంటున్న హిమాయత్ నగర్ డివిజన్ ప్రజలు



హైదరాబాద్(ప్రశ్న న్యూస్ ) వచ్చే కార్పొరేటర్ ఎన్నికల్లో మళ్ళీ మహాలక్ష్మి రామన్ గౌడ్ నే కార్పొరేటర్ గా బంపర్ మెజారిటీతో గెలిపించుకుంటాం అంటూ హిమాయత్ నగర్ డివిజన్ ప్రజలు అల్టిమేటం జారీ చేశారు. సమస్యతో వెళ్లిన ప్రతీ ఒక్కరికి వెంటనే స్పందిస్తూ ఎంతటి సమస్య అయినా సరే దగ్గరుండి పరిష్కరిస్తూ డివిజన్ ప్రజల మన్ననలు పొందుతున్న మహాలక్ష్మి రామన్ గౌడ్ తాజాగా కలుషిత నీటి సమస్యకి చెక్ పెట్టారు. ఈ నేపథ్యంలో హిమాయత్ నగర్ డివిజన్ లోని విటల్ వాడిలో నూతన సీసీ రోడ్డు పనులు జరుగుతుండగా ఆ ప్రాంతంలో నివసిస్తున్న కొన్ని ఇళ్లకు పొల్యూషన్ తో కూడిన కలుషిత నీరు రావడంతో అక్కడి ప్రజలు ఆందోళన చెంది ఆ విషయాన్ని హిమాయత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ దృష్టితో తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మహాలక్ష్మి రామన్ గౌడ్ హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకొని ఆ కలుషిత నీటిని నిశితంగా పరీక్షించి సంబంధిత అధికారులతో మాట్లాడి ఆ సమస్యను దగ్గరుండి పరిష్కరించి సోమవారం రాత్రి మిగిలిన రోడ్డు పనులను కూడా పూర్తి అయ్యేలా చేశారు. ఈ సందర్భంగా డివిజన్ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ మహాలక్ష్మి రామన్ గౌడ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. వచ్చే కార్పొరేటర్ ఎన్నికల్లో రిజర్వేషన్ కనుక వస్తే మళ్ళీ మహాలక్ష్మి రామన్ గౌడ్ ను హిమాయత్ నగర్ డివిజన్ కు కార్పొరేటర్ గా బంపర్ మెజారిటీతో గెలిపించుకుంటాం అని ఆశాభావం వ్యక్తం చేశారు.

# డిజిటల్ మార్కెటింగ్ పేరుతో రూ.వేల కోట్ల మోసాలు

నిర్వహించి 32 మంది నిందితులను అరెస్ట్ చేశారు. ఈ క్యూనెట్ సంస్థ దేశవ్యాప్తంగా వందలాది మంది అమాయకుల దగ్గరి నుంచి కోట్ల రూపాయలను కొల్లగొట్టినట్లు ప్రాథమిక విచారణలో పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై హైదరాబాద్ సీపీ సజ్జనార్ తాజాగా మీడియా సమావేశం నిర్వహించి వెల్లడించారు. 3 రాష్ట్రాల్లో సోదాలు చేసి ఈ నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ నిందితుల నుంచి భారీ మొత్తంలో అగ్రిమెంట్ పేపర్లు, ల్యాప్‌టాప్‌లు, వాచ్‌లు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. 30 స్పెషల్ టీమ్‌లుగా విడిపోయిన హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు, ఈ భారీ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు.అరెస్ట్ అయిన వారిలో ఎక్కువ మంది ఐటీ ఉద్యోగులే ఉన్నట్లు సీపీ సజ్జనార్ వెల్లడించారు. ఇప్పటివరకు నమోదు చేసిన 4 కేసుల్లో కేవలం 11 మంది బాధితుల నుంచే దాదాపు రూ.75 లక్షలు కొట్టేసినట్లు గుర్తించామని తెలిపారు. ఈ కేసులో ఇంకా మిగిలిన నిందితుల కోసం గాలింపు కొనసాగుతోందని వివరించారు. ఈ సందర్భంగా మల్టీ లెవల్ మార్కెటింగ్ స్కీమ్‌ల పట్ల అలర్ట్‌గా ఉండాలని సజ్జనార్ సూచించారు. ఇలాంటి స్కీంలలో చేరడం ఇతరులను చేర్పించడం చట్టప్రకారం నేరమని పేర్కొన్నారు. ఇలాంటి మల్టీ లెవల్ మార్కెటింగ్ స్కామ్‌లలో మోసపోయిన బాధితులు ఎవరైనా ఉంటే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. తెలంగాణలో హైదరాబాద్, వరంగల్, ఏపీలో నంద్యాల, విశాఖపట్నం కర్ణాటకలోని బెంగుళూరులో ఇంటెలిజెన్స్, సైబర్ పోలీసులు అంతా కలిసి పక్కాగా ప్లాన్ చేసి దాడి చేసినట్లు హైదరాబాద్ సీపీ సజ్జనార్ చెప్పారు. నిరుద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ఇంట్లో ఖాళీగా ఉండే గృహిణులను లక్ష్యంగా చేసుకుని ఈ మల్టీ లెవెల్ మార్కెటింగ్ పేరుతో క్యూనెట్ సంస్థ మోసాలకు తెరతీసిందని వెల్లడించారు. సిద్దిపేట మల్టీ లెవల్ మార్కెటింగ్‌లో మోసపోయిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు సజ్జనార్ తెలిపారు.ఇటీవలి కాలంలో హైదరాబాద్ నగరంలోని మధురానగర్, బంజారాహిల్స్, మాసబ్ ట్యాంక్ పోలీస్ స్టేషన్‌లలో ఈ మల్టీ లెవల్ మార్కెటింగ్‌కు సంబంధించి క్యూనెట్ సంస్థపై కేసులు నమోదు కాగా వాటన్నింటినీ పోలీసులు సీసీఎస్‌కు బదిలీ చేశారు. దీంతో వాటన్నింటినీ కలిపి, సీసీఎస్ పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టడంతో క్యూనెట్ బాగోతం బయటికి వచ్చింది. ఈ క్యూనెట్ సంస్థ ప్రధానంగా ఐటీ ఉద్యోగులను టార్గెట్ చేస్తున్నట్లు గుర్తించారు. బ్యాంకుల నుంచి లోన్లను అమాయకులకు ఎక్కువ వడ్డీ పేరుతో ఇప్పించి ఆ తర్వాత క్యూనెట్ సంస్థలో పెట్టుబడులు పెట్టేలా వారిని ఈ ఐటీ ఉద్యోగులుగా ఉన్న క్యూనెట్ సంస్థ ప్రతినిధులు చేసినట్లు గుర్తించారు. కాఫీ షాపుల్లో ఐటీ ఉద్యోగులతో మీటింగ్‌లు ఏర్పాటు చేసి ఆకర్షించే ప్లాన్ అంటూ క్యూనెట్ ప్రతినిధులు ఐటీ ఉద్యోగులను బురిడి కొట్టించారని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే చాలా మంది ఐటీ ఉద్యోగులు క్యూనెట్ ఏజెంట్లుగా మారినట్లు పోలీసుల విచారణలో తేలింది.

# ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతిలో భారీ స్కాం

కుంభకోణాలపై పూర్తిస్థాయి విచారణ జరిపిస్తామని హెచ్చరించారు.

**రైతులకు బోనస్ పై ప్రశ్నలు** యాసంగి వరి పంటకు సంబంధించి రైతులకు ప్రకటించిన బోనస్ ఎప్పటిలోపు చెల్లిస్తారో మంత్రి స్పష్టమైన సమాధానం ఇవ్వడం లేదని హరీశ్ రావు మండిపడ్డారు. ప్రభుత్వం అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వకుండా దాటవేస్తోందని ఆరోపిస్తూ, నిరసనగా సభలోనే బైఠాయించారు. రైతుల ప్రయోజనాల కంటే అడ్వైజర్ల సలహాలకే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆయన విమర్శించారు.

**రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్‌పై బీఆర్ఎస్ నిరసన** రిటైర్డ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం మోసపూరిత వైఖరి చూపుతోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ బెనిఫిట్స్ ఇవ్వడంలో అలసత్వం వహించడం, పీఆర్సీ డీఏ విషయంలో సీపీఎస్ విషయంలో, ఉద్యోగుల పట్ల ఈ ప్రభుత్వం చూపిస్తున్న వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ సభ్యులు శాసనసభ నుంచి వాకౌట్ చేశారు. ఆర్టీసీ కార్మికుల హామీలపై అసెంబ్లీలో హరీశ్ రావు ప్రభుత్వానికి సూటి ప్రశ్నలుతెలంగాణ అసెంబ్లీ వేదికగా ఆర్టీసీ కార్మికుల సమస్యలు, సంస్థ మనుగడపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీశారు. ఎన్నికల ముందు ఆర్టీసీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని ఆయన మండిపడ్డారు. ముఖ్యంగా మహిళల ఉచిత ప్రయాణం (మహాలక్ష్మి పథకం) వల్ల రూ. 9,200 కోట్లు ఆదా అయిందని ప్రభుత్వం చెబుతోందని, అయితే ఆ మొత్తాన్ని ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించిందో లేదో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఆర్టీసీ లాభాల్లో ఉందో లేక నష్టాల్లో ఉందో మంత్రి సమాధానం చెప్పాలని కోరారు.

**బకాయిలు, పీఆర్సీ అమలు** ఆర్టీసీ కార్మికులకు చెల్లించాల్సిన బెనిఫిట్స్, ఏరియర్స్, సీసీఎస్ బకాయిలను ప్రభుత్వం ఎందుకు ఆపుతోందని హరీశ్ రావు ప్రశ్నించారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కొత్త పీఆర్సీని ఎప్పటి నుండి అమలు చేస్తారో తేదీని ప్రకటించాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ గెజిట్ విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఈ ప్రభుత్వం వారిని ఏ తేదీ నుండి ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తుందో తేల్చాలన్నారు.

**యూనియన్ల పునరుద్ధరణ, బస్సుల కొరత** కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో చెప్పినట్లుగా ఆర్టీసీ యూనియన్లను ఎప్పుడు పునరుద్ధరిస్తుందని హరీష్ రావు ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా సిద్దిపేట వంటి డిపోల్లో బస్సుల సంఖ్య దారుణంగా తగ్గిపోయిందని, పాత బస్సుల స్థానంలో కొత్త బస్సులు ఎప్పుడు వస్తాయని నిలదీశారు. ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులు కేటాయించాలని, దాటవేత ధోరణి వీడి కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

## లోకకల్యాణార్థం పంచమఠాలలో పూజాదికాలు



శ్రీశైలం (ప్రశ్న న్యూస్) లోక కల్యాణార్థం పంచమఠాలలో సోమవారం విశేషంగా అభిషేకం, పుష్పార్చనలు జరిపించారు.. ముందుగా ఘంటామఠంలో ఆ తరువాత వరుసగా భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధర మఠాలలో ఈ పూజాదికాలు నిర్వహించారు. కాగా రోజు జరిగిన విశేషపూజాదికాలలో ముందుగా అర్చకస్వాములు లోకకల్యాణ సంకల్పాన్నిపఠించారు. ఈ సంకల్పంలో దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలనీ, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలనీ, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని ఘంటామఠంలోని గణపతికి పూజాదికాలు నిర్వహించబడ్డాయి. తరువాత అన్ని మఠాలలో సంప్రదాయబద్ధంగా అభిషేకాది అర్చనలను నిర్వహించారు. కాగా శ్రీశైల సంస్కృతిలో చాలాకాలం పాటు మఠాలు ప్రధానపాత్ర పోషించాయి. ప్రస్తుత సాధారణశకం 7వ శతాబ్దం నుంచి నిర్మించబడ్డ ఈ మఠాలు, గర్భాలయం, అంతరాలయం, ముఖమండపం లాంటి నిర్మాణాలను కలిగివుండి, చూడటానికి ఆలయాల మాదిరిగానే కనిపిస్తాయి.

## సూర్య కిరణాల తేజస్సులో విరాజిల్లిన శ్రీ కోదండరాముడు



తిరుపతి (ప్రశ్న న్యూస్ ) శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 8 గంటలకు స్వామివారు సూర్యప్రభ వాహనంపై దేదీప్యమానంగా ప్రకాశించారు. ఆలయ నాలుగు మాడ వీధుల్లో వాహనసేవ వైభవంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. సూర్యుడు తేజోనిధి. సకలరోగ నివారకుడు. ప్రకృతికి చైతన్యప్రదాత. వర్షాలు, వాటివల్ల పెరిగే సస్యాలు, చంద్రుడు, అతని వల్ల పెరిగే ఔషధాలు మొదలైనవన్నీ సూర్యతేజం వల్లనే వెలుగొందుతున్నాయి. అనంతరం ఉదయం 10.30 నుండి 11.30 గంటల వరకు శ్రీ సీత లక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంలతో అభిషేకం చేశారు. వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శ్రీ కోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం వైభవంగా జరుగనుంది. ఉదయం 7.30 గంటలకు స్వామివారు రథారోహణం చేస్తారు. ఉదయం 8.30 గంటలకు రథంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి 7 నుండి 8 గంటల వరకు అశ్వవాహనంపై స్వామివారు విహరించి భక్తులను కటాక్షించనున్నారు.

## బీజేపీ నేతల ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం

- ప్రశ్నిస్తేఅరెస్టులా? ప్రజల గొంతుకను అణచివేతే లక్ష్యమా?
- కాంగ్రెస్ నిర్బంధ రాజకీయాలకు భయపడేదే లేదు
- ప్రజల పక్షాన నిరంతర పోరాటాన్ని కొనసాగిస్తాం

-భాజపా మండలాలధ్యక్షులు : ఎడపల్లి పరశురామ్




బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలంలో బీజేపీ నాయకుల అరెస్టులపై భాజపా మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తామని చెబుతూ, ప్రస్తుతానికి మాత్రం ప్రజల స్వరాన్ని అణచివేసే విధంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు నాయకత్వంలో జరగనున్న అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని అడ్డుకోవాలనే ఉద్దేశంతోనే బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేయించారని ఆరోపించారు. ఇది ప్రభుత్వంలో పెరుగుతున్న భయాందోళనలకు స్పష్టమైన సంకేతమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్‌తో పాటు మాజీ మండల అధ్యక్షులు గుడి రవీందర్ రెడ్డి, స్థంబంపల్లి గ్రామ సర్పంచ్, బీజేపీ సీనియర్ నాయకులు బొంగాని అశోక్ గౌడ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకోవడం పూర్తిగా అప్రజా స్వామికమని అన్నారు. "ప్రజా సమస్యలపై మాట్లాడితే అరెస్టులు... పోరాడితే నిర్బంధం... ఇదేనా ప్రజాస్వామ్యం?" అంటూ ఆయన ప్రశ్నించారు. ముందస్తు అరెస్టులు ప్రజాస్వామ్య విలువలను తుంచే చర్యలని, ప్రజల హక్కులను హరిస్తున్నాయని మండిపడ్డారు. అలాంటి చర్యలతో బీజేపీ కార్యకర్తల సంకల్పాన్ని దెబ్బతీయలేరని, పార్టీ ప్రజల కోసం తన పోరాటాన్ని నిరంతరంగా మరింత ఉత్సాహంగా కొనసాగిస్తుందని ఎడపల్లి పరశురామ్ స్పష్టం చేశారు.

# ఆటో డ్రైవర్లకు ఎల్పీజీ గ్యాస్ కష్టాలు

- గ్యాస్ కోసం కిలోమీటర్ల కొద్ది "క్యూ" లైన్ లు
- కుటుంబాలపై భారంగా మారిన సరఫరా సంక్షోభం
- ప్రజలకు ఆటోలు దొరకక ప్రయాణ అవస్థలు

(గౌటి రామకృష్ణ - ప్రశ్న న్యూస్)







హైదరాబాద్ నగరంలో ఎల్పిజి గ్యాస్ కోసం ఆటో డ్రైవర్ల పరిస్థితి రోజురోజుకు మరింత దయనీయంగా మారుతోంది. జీవనాధారం అయిన ఆటో నడపడానికి అవసరమైన ఎల్పీజీ గ్యాస్ దొరకడం కష్టసాధ్యంగా మారడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గంటల తరబడి, కొన్ని సందర్భాల్లో కిలోమీటర్ల కొద్దీ క్యూలలో నిలబడి గ్యాస్ కోసం వేచి ఉండాల్సి వస్తోందని డ్రైవర్లు వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో ఆటో నడపడానికి సమయం దొరకక, రోజువారీ ఆదాయం పూర్తిగా దెబ్బతింటోందని చెబుతున్నారు. ఉదయం, రాత్రి తేడా లేకుండా గ్యాస్ బంకుల వద్దకు చేరుకుంటున్న డ్రైవర్లు, సాయంత్రం వరకు కూడా తమ వంతు రాకపోవడం వల్ల నిరాశతో వెనుదిరగాల్సి వస్తోంది. ఒకవైపు కుటుంబ పోషణ, మరోవైపు పెరుగుతున్న ఖర్చులు ఈ రెండింటి మధ్య ఆటో డ్రైవర్లు ఇరుక్కుపోయారు. ఆటో నడపకపోతే ఇంట్లో పిల్లలకు అన్నం పెట్టలేం, కానీ గ్యాస్ కోసం రోజంతా లైన్‌లో నిల్చుంటే ఎలా నడపాలి.?అని పలువురు డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### గ్యాస్ సరఫరా తగ్గిందా.? బ్లాక్ మార్కెట్ దందా నా.?

తెలంగాణలో గ్యాస్ సరఫరా తగ్గిందా.?
లేక పంపిణీ వ్యవస్థలో లోపాలున్నాయా.? బ్లాక్ మార్కెట్ దందానా.?అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ స్థాయిలో సరఫరా సమృద్ధిగా ఉందని చెప్పిన ప్రాక్టికల్ స్థాయిలో మాత్రం డ్రైవర్లకు అందుబాటులోకి రావడం లేదని వారు ఆరోపిస్తున్నారు. అధికారుల మాటలు, వాస్తవ పరిస్థితులు పూర్తిగా విభిన్నంగా ఉన్నాయని అంటున్నారు. ఇదిలా ఉండగా, ప్రైవేటు గ్యాస్ ఏజెన్సీలు ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని అధిక ధరలకు గ్యాస్ అమ్ముతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణ ధరకు లభించాల్సిన గ్యాస్, బ్లాక్ మార్కెట్‌లో అధిక రేట్లకు అమ్ముతున్నారని డ్రైవర్లు మండిపడుతున్నారు. సర్కారు గ్యాస్ దొరకడం లేదా.? ప్రైవేటు వాళ్లు అయితే ఎక్కువ డబ్బు అడుగుతున్నారు. మా పరిస్థితి ఏమిటి.? అంటూ వారు ప్రశ్నిస్తున్నారు. గ్యాస్ కోసం లైన్‌లో నిలబడటం వల్ల రోజుకు కనీసం 6 నుంచి 8 గంటలు వృథా అవుతున్నాయని డ్రైవర్లు చెబుతున్నారు. ఇది నేరుగా వారి ఆదాయంపై ప్రభావం చూపుతోంది. సాధారణంగా రోజుకు 1000 నుంచి 1500 రూపాయలు సంపాదించే డ్రైవర్లు, ఇప్పుడు 300 నుంచి 400 రూపాయలు కూడా సంపాదించలేని పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. కుటుంబ ఖర్చులు, పిల్లల చదువు, ఇల్లు అద్దె అన్ని కలిసి భారీ భారం అవుతున్నాయన్నారు.

### గ్యాస్ బంకుల వద్ద పరిస్థితి అధ్వాన్నం..

గ్యాస్ బంకుల వద్ద సరైన నిర్వహణ లేకపోవడం కూడా సమస్యను మరింత తీవ్రం చేస్తోంది. క్యూలను నియంత్రించడానికి సరైన సిబ్బంది లేకపోవడం, టోకెన్ విధానం అమలు చేయకపోవడం, సమాచారం లోపించడం వంటి అంశాలు డ్రైవర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కొన్ని చోట్ల డ్రైవర్ల మధ్య వాగ్వాదాలు, తోపులాటలు కూడా జరుగుతున్నాయి. గంటల తరబడి నిలబడినా గ్యాస్ దొరకకపోతే మళ్లీ రేపు రావాలని చెబుతున్నారు. ఇది ఏమైనా పద్ధతా.? అని ఒక డ్రైవర్ ప్రశ్నించారు. మరొకరు మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా తగ్గించలేదని చెబుతోంది. అయితే మాకు ఎందుకు దొరకడం లేదు.? మధ్యలో ఎవరో ఆటలు ఆడుతున్నారు అని ఆరోపించారు. ఈ సమస్య వల్ల కేవలం డ్రైవర్లకే కాదు, ప్రయాణికులకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆటోలు రోడ్డుపై తగ్గిపోవడంతో ప్రయాణ ఛార్జీలు పెరిగాయి. ముఖ్యంగా పీక్ అవర్స్‌లో ఆటో దొరకడం కష్టమవుతోంది.

దీంతో సాధారణ ప్రజలు కూడా ఈ సమస్య ప్రభావాన్ని అనుభవిస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే, ఆటో డ్రైవర్ల జీవన విధానం పూర్తిగా సంక్షోభంలో పడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గ్యాస్ సరఫరా వ్యవస్థను సక్రమంగా నిర్వహించకపోతే, ఇది మరింత పెద్ద సమస్యగా మారే అవకాశం ఉందని అంటున్నారు.

ఈ నేపథ్యంలో, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని గ్యాస్ సరఫరాను పెంచడం, బంకుల వద్ద క్యూలను నియంత్రించడానికి టోకెన్ వ్యవస్థ అమలు చేయడం, ప్రైవేటు ఏజెన్సీల అక్రమాలను అరికట్టడం వంటి చర్యలు తీసుకోవాలని డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. అలాగే సమస్య పరిష్కారం వరకు తాత్కాలిక ఉపశమనం కల్పించే చర్యలు కూడా అవసరమని వారు కోరుతున్నారు. మేము ఎవరి వద్దకు వెళ్లాలి ? మా సమస్యను ఎవరు వింటారు.? అనే ప్రశ్నతో ఆటో డ్రైవర్లు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు.

జీవనాధారం కోల్పోతున్న ఈ వర్గం కష్టాలను పట్టించుకోకపోతే, వారి పరిస్థితి మరింత దుర్భరంగా మారడం ఖాయం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్యాస్ సంక్షోభానికి శాశ్వత పరిష్కారం చూపాలని ఆటో డ్రైవర్లు ఆశగా ఎదురుచూస్తున్నారు. లేదంటే గ్యాస్ కోసం క్యూ లైన్ జీవితం కోసం పోరాటం అనే నినాదం వారి వాస్తవంగా మారిపోతుందని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ప్రతి రైతునూ ఆదుకుంటాం.. అధైర్యపడొద్దు

- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- నష్టపోయిన ప్రతి సెంటు భూమికి నష్టపరిహారం అందిస్తాం
- వడగండ్ల వానతో పంటలు నష్టపోయిన రైతులకు మంత్రి ఆనం భరోసా

-అనంతసాగరం మండలంలో దెబ్బతిన్న పంటలను ప్రత్యక్షంగా పరిశీలించిన మంత్రి ఆనం

- రెండు రోజుల్లో పూర్తిస్థాయి నష్టపరిహారం వివరాలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం



ఆత్మకూరు,(ప్రశ్న న్యూస్ )పంట నష్టపోయిన ప్రతిఒక్క రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందని, ప్రతి సెంటు భూమికి నష్టపరిహారం చెల్లిస్తామని రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హామీ ఇచ్చారు. అనంతసాగరం మండలంలోని చిలకలమర్రి, కామిరెడ్డిపాడు, మంగుపల్లి గ్రామాల్లో ఇటీవల కురిసిన వడగండ్ల వానకు దెబ్బతిన్న వరి, పత్తి, మిరప తదితర పంటలను మంత్రి రైతులు, అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా చేతికి వచ్చిన పంట పూర్తిగా నష్టపోయిందని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేయగా, ప్రతి రైతును ఆదుకుంటామని మంత్రి భరోసా ఇచ్చి ఓదార్చారు. అనంతరం అనంతసాగరం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వ్యవసాయ, ఉద్యానవన, రెవెన్యూ శాఖల అధికారులు పంట నష్టం వివరాలను మంత్రికి తెలియజేశారు.

ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యం కారణంగా అనంతసాగరం, మర్రిపాడు, కలువాయి, రాపూరు, సీతారాంపురం, లింగసముద్రం మండలాల్లోని 21 గ్రామాల్లో 1469 మంది రైతులు సుమారు 1289 హెక్టార్లలో పంటలను నష్టపోయినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిపారు. అనంతసాగరం మండలంలోనే అత్యధికంగా 1054 హెక్టార్లలో పంట నష్టం సంభవించిందని, ముఖ్యంగా వరి పంట తీవ్రంగా దెబ్బతిన్నదని మంత్రి తెలిపారు. మొక్కజొన్న, మిరప, నిమ్మ, పొగాకు పంటలు కూడా కొంత మేర ప్రభావితమయ్యాయని చెప్పారు. రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో తక్షణమే కచ్చితమైన ఎన్యుమరేషన్ పూర్తి చేసి నివేదికను కలెక్టర్‌కు అందించాలని అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపించి, మార్గదర్శకాల మేరకు సకాలంలో నష్టపరిహారం అందిస్తామని పేర్కొన్నారు.

కౌలు రైతులను కూడా ఆదుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి నర్సోజి రావు, ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, ఆర్డీవో పావని, తహసీల్దార్ పద్మజ, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయం కోసం పోరాడిన దొమ్మేటి వెంకటరెడ్డి స్ఫూర్తి భావితరాలకు మార్గదర్శకం

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



నంద్యాల (ప్రశ్న న్యూస్ )సామాజిక న్యాయం, విద్యా ప్రబోధం, అనగారిన వర్గాల హక్కుల కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు దొమ్మేటి వెంకటరెడ్డి స్ఫూర్తిని భావితరాలు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆకాంక్షించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో దొమ్మేటి వెంకటరెడ్డి 174వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, దొమ్మేటి వెంకటరెడ్డి శెట్టి బలిజ సమాజానికి చెందిన ప్రముఖ నాయకుడిగా, ఆ వర్గం హక్కుల కోసం బ్రిటిష్ పాలన కాలంలోనే పోరాడిన మహోన్నత వ్యక్తిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. సమాజంలోని వెనుకబడిన వర్గాలకు న్యాయం జరగాలనే లక్ష్యంతో ఆయన చేసిన కృషి ఆదర్శప్రాయమని కొనియాడారు. విద్య ప్రాధాన్యతను ఎంతో ముందుగానే గుర్తించిన వెంకటరెడ్డి , ముఖ్యంగా వయోజన విద్యకు ప్రోత్సాహం ఇచ్చి ప్రతి ఇంటికి అక్షరాస్యతను తీసుకెళ్లేందుకు కృషి చేశారని తెలిపారు. సామాజిక చైతన్యం, హక్కుల కోసం పోరాట స్ఫూర్తిని ప్రజల్లో నింపిన నాయకుడిగా ఆయన నిలిచారని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, డిఆర్‌ఓ రాము నాయక్, బీసీ సంక్షేమ అధికారి జగ్గయ్య, బీసీ కార్పొరేషన్ ఈడి జాకీర్ హుస్సేన్‌తో పాటు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## దేవాలయాల భూములను కాపాడండి : కళ్ళం సంజీవరెడ్డి





ఉండవల్లి (ప్రశ్న న్యూస్) గ్రామంలో వేంచేసియున్న శ్రీవేణుగోపాలస్వామి, శ్రీ భాస్కర స్వామి ,శ్రీ భీమ లింగేశ్వర స్వామి వారి దేవాలయాల 24 ఎకరాల 48 సెంట్లు భూమి ఉందని ఆ భూముల పరిరక్షణ వాటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులు అర్చకుల విషయంలో సీఆర్డీఏ అధికారులతో పాటు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు మాజీ ఎంపిటిసి సభ్యులు, దేవాలయ పరిరక్షణ కమిటీ సభ్యులు కళ్ళం సంజీవరెడ్డిఅన్నారు. సోమవారం ఉండవల్లిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు దేవాలయాలకు సంబంధించి 24 ఎకరాల 48 సెంట్లు భూమిని అభివృద్ధి చేయటం ద్వారా దేవాలయాల అభివృద్ధి తోపాటు వాటిపై ఆధారపడి జీవిస్తున్న వారికి ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. కోట్ల రూపాయల విలువచేసే ఈ భూమిని సీఆర్డీఏ స్వాధీనం చేసుకుని నేటికి పది సంవత్సరాలు పూర్తయిందని నాలుగు కిలోమీటర్ల దూరంలో విలువ లేని భూములను దేవాలయాలకు కేటాయించడాన్ని కమిటీ సభ్యులు వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేష్ ,మంత్రి నారాయణ సంబంధిత అధికారులు వెంటనే స్పందించి దేవాలయ భూములను, పేదల భూములను కాపాడాలని వాటిని పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉండవల్లి గ్రూప్ టెంపుల్స్ ఈవో డి.ప్రమీల, ఉండవల్లి వేణుగోపాలస్వామి అర్చకులు శ్రీనివాసాచార్యులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కాపీయింగ్ కు ఆస్కారం ఉండకూడదు

**నిబంధనల అమలుపై నిశిత పరిశీలన**

**ఎస్సెస్సీ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్**



నిజామాబాద్(ప్రశ్న న్యూస్) పదవ తరగతి పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని మానిక్ భవన్ పాఠశాలతో పాటు నలంద హైస్కూల్ ఎగ్జామ్ సెంటర్లను సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు, సిబ్బంది హాజరు గురించి ఆరా తీశారు. నిబంధనలకు అనుగుణంగానే నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా అని ఆరా తీశారు. తప్పనిసరిగా సి.సి కెమెరా రికార్డింగ్ నడుమ ప్రశ్న పత్రాల బండిల్ సీళ్లు తెరవాలని సూచించారు. ఈ మేరకు నిబంధనలు పాటించారా లేదా అని సి.సి ఫుటేజీల పరిశీలన ద్వారా నిర్ధారణ చేసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ఆరోగ్య కార్యకర్త అందుబాటులో ఉన్నారా లేదా అని గమనించారు. ఎగ్జామ్ హాల్లోకి సిబ్బంది ఎవరైనా సెల్ ఫోన్లతో వచ్చారా అని కలెక్టర్ నిశిత పరిశీలన చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని సూచించారు. ఎక్కడ కూడా కాపీయింగ్ కు ఆస్కారం ఉండకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, కాపీయింగ్ కు ఆస్కారం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. పరీక్షలు ముగిసేంత వరకు అప్రమత్తతతో పకడ్బందీగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రశ్న పత్రాలను తప్పనిసరిగా తగిన పోలీసు బందోబస్తు మధ్య కేంద్రాలకు తరలించాలని, ఎలాంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు జె.శంకర్, టి.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# ఓపెన్ జిమ్ పరికరాలు మార్చండి

**విరిగిపోయిన వాటి స్థానంలో**

**కొత్తవి అమర్చండి**

**చిన్నపిల్లల ఆడుకోవడానికి వీలు ఉండే**

**విధంగా ఆటవస్తులు ఏర్పాటు చేయాలి**

**ఎస్సీ సెల్ అధ్యక్షులు కుండ భానుచందర్**





మేడ్చల్ ( ప్రశ్న న్యూస్ )గుండ్ల పోచంపల్లి 299 డివిజన్ పరిధిలోని గుండ్ల పోచంపల్లి మినీ ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలు విరిగిపోవడం జరిగిందని 299 డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కుండ భానుచందర్ తెలిపారు. ఈ సందర్భంగా కుండా భానుచందర్ మాట్లాడుతూ గుండ్ల పోచంపల్లి మున్సిపల్ ఉన్నప్పుడు ఈ ఓపెన్ జిమ్మును ప్రారంభించడం జరిగిందని అందులో కొన్ని పరికరాలు గత కొన్ని నెలల నుండి శిథిలవస్తులకు చేరి విరిగిపోవడం జరిగిందన్నారు. గుండ్ల పోచంపల్లి పరిధిలోని యువకులు పెద్దలంతా కలిసి ఉదయం సాయంకాలం పూట ఇక్కడ వ్యాయామం చేస్తారని కానీ అందులో సగానికి పైగా విరిగిపోవడంతో ఇక్కడ వ్యాయామం చేయడానికి ఎవరు కూడా రావడంలేదని, వాటిని ఎవరు కూడా పర్యవేక్షించడం లేదని లక్షలు ఖర్చు పెట్టి ఏర్పాటుచేసిన ఈ ఓపెన్ జిమ్ కేవలం చూడడానికి మాత్రమే ఉందన్నారు. ఈ యొక్క ఓపెన్ జిమ్ కు మరమ్మతులు చేసి కొత్త పరికరాలను ఏర్పాటు చేసి గుండ్ల పోచంపల్లి డివిజన్ ప్రజలకు వ్యాయామం చేయడనికి అందుబాటులో తీసుకురావాలని కోరుతున్నట్లు తెలిపారు. తుప్పు పట్టిన జిమ్ము పరికరాలను మార్చి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని, అలాగే చిన్న పిల్లలు ఆడుకునే విధంగా మరిన్ని చిన్న పిల్లల ఆట వస్తువులు కూడా అక్కడ ఏర్పాటు చేయాలని కమిషన్ ని కోరుతున్నట్లు కుండ భానుచందర్ తెలిపారు. ఈ ఓపెన్ జిమ్ ను వాడుకంలోకి తీసుకువస్తే యువకులు పెద్దలు వారి యొక్క శరీర దృఢత్వాన్ని పెంచుకొని, సంపూర్ణ ఆరోగ్యంతో, ప్రశాంతతతో ఉంటారని తెలిపారు. ఇకనైనా కమిషనర్ స్పందించి ఈ యొక్క ఓపెన్ జిమ్ కు మరమ్మతులు చేస్తారని కోరుతున్నట్లు తెలిపారు.

# సొంతింటి కల -కాంగ్రెస్ తోనే సాధ్యం

**ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన అందరికి ఇందిరమ్మ ఇండ్లు**

**మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ**

**పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయం**





మేడ్చల్ (ప్రశ్న న్యూస్)మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డుకి చెందిన గుండ రాములమ్మ కుటుంబీకులకు మంజూరైన రూ.5లక్షలతో నిర్మించిన నూతన ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ కార్యక్రమంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి,మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు.ఈ సందర్భంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి గౌరవనీయులు రేవంత్ రెడ్డి నేతృత్వం లోని ప్రభుత్వం,ప్రతి పేదవానికి సొంతింటి కల నిజం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్లు పథకాన్ని కాంగ్రెస్ తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ముందుకు తీసుకెళ్తోంది,ఇందిరమ్మ రాజ్యం ప్రజా పాలనలో ప్రియమైన తెలంగాణ సోదర సోదరీమణులకు,అందరికీ ఆత్మగౌరవంతో కూడిన నివాసం ఉండాలన్నదే మన ప్రభుత్వ సంకల్పం.గతంలో ఇందిరా గాంధీ పేదల కోసం ఇళ్లు నిర్మించిన స్ఫూర్తితో నేడు మన రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే అవకాశాన్ని కల్పిస్తూ సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం తరపున ?5 లక్షల ఆర్థిక సాయం అందించబడుతుందని మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ తెలియజేస్తూ ఇందిరమ్మ ఇళ్ళను ప్రారంభోత్సవం చేయడం ఎంతో సంతోషకరంగా ఉందని,పేదల కళ్ళలో ఆనందం నింపడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని,ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాలు,పట్టణాలు లేవని అన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని,ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ ఏఇ సుభాష్ రెడ్డి,మేడ్చల్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేగు రాజు కురుమ,మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి,మేడ్చల్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్ కురుమ,మేడ్చల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ,మేడ్చల్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉదండపురం సత్యనారాయణ,మేడ్చల్ మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లవంగు రాకేష్ వంజరి,మేడ్చల్ మున్సిపాలిటీ ఎన్ ఎస్ యూ ఐ అధ్యక్షులు గుండ శ్రీధర్ కురుమ,మేడ్చల్ మున్సిపాలిటీ ఎస్ సి సెల్ అధ్యక్షులు దండు శ్రీకాంత్ (చింటు),కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కనకాల నాగభూషణం (బుషి),రామన్నగారి రాఘువేందర్ గౌడ్,నడికొప్పు రంజిత్ ముదిరాజ్,రామన్నగారి సంతోష్ గౌడ్,మరిగల బాబు,వేముల రంజిత్ రెడ్డి,చీర్ల ఆకాష్ కురుమ,గుండ గణేష్,మల్లేష్,సంతోష్,వెంకటేష్,సోను కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,ఇందిరమ్మ కమిటీ సభ్యులు,లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు...

## బీజేపీకిసాన్ మోర్చా ఆధ్వర్యంలో

# అసెంబ్లీ ముట్టడి

**కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలశీ**

**అసెంబ్లీ వద్ద లక్ష్మీనర్సయ్యు అరెస్ట్**




నిజామాబాద్(ప్రశ్న న్యూస్) బీజేపీ పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫల మైనందున యువత, మహిళ మరియు రైతు సమస్యలపై సోమవారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లిన బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, నిజామాబాద్ నేత బస్వాపురం లక్ష్మీనర్సయ్యను అసెంబ్లీ వద్ద పోలీసులు అడ్డుకొని అరెస్ట్ చేశారు. అనంతరం అఫ్జల్ గంజ్ పోలీస్ స్టేషను తరలించారు. తప్పుడు వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కాలం వెల్లదీస్తుందన్నారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు . ఆయనతో పాటు ఎక్స్ ఎంపీ బీబీ పాటిల్ , రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు ని , జిల్లా అధ్యక్షులు ఇతర ముఖ్య నాయకులను అరెస్టు చేసి అఫ్జల్ గంజ్ పోలీస్ స్టేషన్ కు తరలించిన పోలీసులు.

# బీజేపీ నేతల ముందస్తు అరెస్ట్

**ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన బీజేపీ నాయకులు**





మేడ్చల్ ( ప్రశ్న న్యూస్ ) తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు పిలుపునిచ్చిన 'అసెంబ్లీ ముట్టడి' కార్యక్రమం మేడ్చల్మండలంలో ఉద్రిక్తతకు దారితీసింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు బయలుదేరిన బీజేపీ సీనియర్ నాయకులను మేడ్చల్ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీజేపీ సోమవారం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో మేడ్చల్ నుండి భారీ ఎత్తున కార్యకర్తలతో తరలివెళ్లేందుకు సిద్ధమైన బిజెపి నాయకులను, కార్యకర్తలను పోలీసులు వారి నివాసం వద్ద అడ్డుకున్నారు. శాంతి భద్రతల దృష్ట్యా ఈ ముందస్తు అరెస్టులు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన బీజేపీ నాయకులు..**

పోలీసుల చర్యను బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలపై గొంతెత్తుతుంటే అక్రమ అరెస్టులతో అణచివేయాలని చూడటం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎన్ని అరెస్టులు చేసినా బీజేపీ కార్యకర్తల పోరాటం ఆగదని స్పష్టం చేశారు. రామచందర్ రావు నాయకత్వంలో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టి తీరుతామని హెచ్చరించారు.

## రైల్వే ప్రాజెక్టులపై త్వరితగతిన

# నిర్ణయాలు తీసుకోవాలి

**కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కోరిన ఎంపీ అర్వింద్**



నిజామాబాద్(ప్రశ్న న్యూస్) నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి ఉత్తర తెలంగాణకు సంబంధించిన ముఖ్యమైన రైల్వే ప్రాజెక్టులపై ఇప్పటికే పలుమార్లు కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ కొన్ని అంశాల్లో ఇంకా నిర్ణయాలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో, ఆయన మరోసారి కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లారు. నిజామాబాద్ జంక్షన్‌లో పిట్ లైన్ , కోచింగ్ డిపో ఏర్పాటు, పలు రైళ్ల పొడగింపులు అలాగే పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలకు ఆమోదం వంటి అంశాలు ప్రాంతీయ అభివృద్ధికి ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. అంతేగాకుండా నవీపేట్ , ఇందల్వాయి వద్ద అదనంగా ఆర్ ఓ బిలు, డిచ్ పల్లి, అమ్మక్కపేట వద్ద ఆర్ యూ బిల నిర్మాణాల ప్రక్రియను వేగవంతం చేయాలని , జానకంపేట్ వద్ద ఆర్ యూ బి విస్తరణ, రైళ్ల పొడిగింపు, నిజామాబాద్, మెట్పల్లి, కోరుట్ల,జగిత్యాల, కరీంనగర్ మీదుగా తిరుపతికి రైళ్లు, నిజామాబాద్ మీదుగా వందే భారత్ ట్రైన్లను త్వరితగతిన అమలు కావాలని కోరారు.ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఈ ప్రాజెక్టులపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరగా నిర్ణయాలు తీసుకోవాలని ఎంపీ అర్వింద్ రైల్వే మంత్రి ని కోరారు. కాగా తాను కోరినట్టుగా ఎడపల్లి వద్ద ఆర్ఓబి నిర్మాణం, డిచ్ పల్లి లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరు, ఆర్మూర్ –ఆదిలాబాద్ రైల్వే లైన్ పనుల మంజూరు పట్ల ఆయన రైల్వే మంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు.

# శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి విశేష అభిషేకం



శ్రీశైలం (ప్రశ్న న్యూస్ ) లోకకల్యాణం కోసం కృత్తికా నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవస్థానం ఈ రోజు ఉదయం ఆలయప్రాంగణంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామి (కుమారస్వామి) వారికి విశేష పూజలను నిర్వహించారు.ప్రతి మంగళవారం కృత్తికానక్షత్రం, షష్ఠి తిథి రోజులలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి ఈ విశేషఅభిషేకం పూజాదికాలు దేవస్థానంసేవగా సర్కారిసేవగా నిర్వహించుతున్నారు.

కుమారస్వామివారికి పూజలు జరపడం వలన లోకకల్యాణమే కాకుండా ప్రతి ఒక్కరికి ఉద్యోగ, వ్యాపార, వ్యవహారాలలో ఆటుపోట్లు తొలగి ఆయా పనులు సక్రమంగా జరుగుతాయి. సుబ్రహ్మణ్యస్వామి అనుగ్రహంతో శత్రుబాధలు, గ్రహపీడలు, దృష్టి దోషాలు మొదలైనవి తొలగిపోతాయి. అలాగే సంతానం కోసం పూజించేవారికి

తప్పక సంతానభాగ్యం లభిస్తుందని చెప్పబడుతోంది.

ఈ అభిషేకానికి ముందుగా దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతివైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు.



# అకీరా ఎంట్రీపై నిహారిక క్లారిటీ..

## – మై స్మాల్ బిగ్ బేబీ అంటూ కామెంట్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కుమారుడు అకీరా నందన్ హీరోగా ఎంట్రీ ఇవ్వాలని అభిమానులు చాలా కాలంగా ఎదురుచూస్తున్నారు. 'ఓజీ' సినిమాలో చిన్న పవన్ పాత్రను అకీరా చేస్తే బాగుండేదనే అభిప్రాయం కూడా వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో మెగా డాటర్ నిహారిక కొణిదెల తాజా ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.అకీరా గురించి మాట్లాడుతూ నిహారిక ప్రేమగా "మై స్మాల్ బిగ్ బేబీ" అంటూ అభివర్ణించారు. "అకీరా హార్ట్ ఆఫ్ గోల్డ్. బాబాయ్ పవన్ కళ్యాణ్‌లాగే ఎక్కువ మాట్లాడడు. కానీ ప్రేమ మాత్రం చాలా ఎక్కువ. హీరో అవుతాడా లేదా అనే విషయం నాతో డైరెక్ట్‌గా చెప్పలేదు. మీడియా ఎక్స్‌పోజర్ వల్లే ఈ విషయంపై ఎక్కువ ప్రచారం జరుగుతోంది" అని తెలిపారు.ఇటీవల 'ఉస్తాద్ భగత్ సింగ్' థియేటర్ల వద్ద అకీరాను "ఒమేగా స్టార్"గా పేర్కొంటూ ప్లకార్డులు కనిపించడం పై కూడా నిహారిక స్పందించారు. సెలబ్రిటీ పిల్లల ప్రైవసీకి భంగం కలిగించే విధంగా వ్యవహరించడం సరైంది కాదని ఆమె స్పష్టం చేశారు. మా టైంలో సోషల్ మీడియా అంతగా లేదు. అందుకే మా బాల్యం బాల్యంగానే గడిచింది. ఇప్పుడు పిల్లల ప్రైవసీని గౌరవించాలి. అది అభిమానంగా కాదు, అబ్యూస్‌గా మారుతోంది అంటూ గట్టిగా హెచ్చరించారు. ఇక తన వ్యక్తిగత జీవితంపై కూడా నిహారిక ఓపెన్‌గా మాట్లాడారు. తన వివాహ బంధం విరగడానికి ఒక్క కారణం ఉండదని, అనేక అంశాలు కలిసి ప్రభావం చూపుతాయని చెప్పారు.రిలేషన్‌షిప్ నుంచి బయటకు రావాలని నిర్ణయించినప్పుడు ముందుగా నాన్న నాగబాబుగారితో మాట్లాడాను. నేను సంతోషంగా లేనని ఆయన అర్థం చేసుకున్నారు. జీవితంలో హ్యాపీగా లేకపోతే బలవంతంగా కొనసాగించాల్సిన అవసరం లేదని ఆయనే చెప్పారు అని వివరించారు.కాగా, 2020లో చైతన్య జొన్నలగడ్డను వివాహం చేసుకున్న నిహారిక, 2023లో పరస్పర అంగీకారంతో విడిపోయిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రెండో పెళ్లిపై స్పందిస్తూ, నేను ఇప్పుడే పెళ్లి చేసుకునే ఆలోచనలో లేను. కానీ పెళ్లి మాత్రం చేసుకుంటాను. విధి రాతను నమ్ముతాను. సరైన వ్యక్తి నా జీవితంలోకి రావాల్సి ఉంటే తప్పకుండా వస్తాడు అని చెప్పారు.సినిమాల విషయానికి వస్తే, నటనకు బ్రేక్ ఇచ్చిన నిహారిక ప్రస్తుతం నిర్మాతగా సత్తా చాటుతున్నారు. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై వరుస ప్రాజెక్టులు నిర్మిస్తున్నారు. తాజాగా సంగీత్ శోభన్ హీరోగా 'రాకాస' అనే సినిమాను నిర్మించగా, ఈ చిత్రం ఏప్రిల్ 3న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## ముంబై స్లమ్స్‌లో విజయ్ దేవరకొండ

# 'రౌడీ జనార్ధన'..!




టాలీవుడ్ యాక్టర్ విజయ్ దేవరకొండ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో ఒకటి రాహుల్ సంకీర్త్యన్‌తో చేస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా. విజయ్ మరోవైపు దిల్ రాజు నిర్మాణంలో రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఓ రూరల్ మాస్ డ్రామాకు కమిటవగా.. ఈ చిత్రానికి రౌడీ జనార్ధన అనే టైటిల్ కూడా ఖరారు చేశారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో గ్రాండ్ స్కేల్‌లో ఉండబోయే యాక్షన్ సీక్వెన్స్‌ను విజయ్ టీం డిజైన్ చేస్తుందట. ముంబై స్లమ్స్ ఏరియాలో రాబోయే హై ఆక్టేన్ ఫైట్ సీక్వెన్స్ సినిమాకే హైలెట్‌గా నిలువబోతుందట. ఇంటెన్స్, రియలిస్టిక్ యాక్షన్ ఎక్స్‌పీరియన్స్ అందించేలా ఈ ఎపిసోడ్ ఉండనుందని ఇన్‌సైడ్ టాక్. ఇప్పటికే విజయ్ దేవరకొండ ట్రాన్స్‌ఫార్మేషన్ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేస్తుంది. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో రియల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రంలో విజయ్ పాత్ర పేరు జనార్ధన్ కాగా, ఆయన నాన్న పేరు కూడా జనార్ధనేనని ఇన్‌సైడ్ టాక్. విజయ్ దేవరకొండకు 'రౌడీ' అనే ట్యాగ్ ఎప్పటి నుంచో ఉంది. ఇప్పుడు రౌడీ టైటిల్‌తో సినిమా వస్తుండడంతో ఫ్యాన్స్ అంతా ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఈ సినిమాతో విజయ్ తన విశ్వరూపం చూపించనున్నాడని కామెంట్ చేస్తున్నారు.

## నా పేరుతో డబ్బులు వసూలు చేస్తే

# నమ్మొద్దు..



ప్రఖ్యాత ఫోక్ సింగర్ మంగ్లీ పేరుతో మైక్రో ఫైనాన్స్ వ్యాపారం జరుగుతోందని వస్తున్న వార్తలపై ఆమె ఘాటుగా స్పందించారు. తనకు అలాంటి ఎలాంటి వ్యాపారాలతో సంబంధం లేదని స్పష్టం చేస్తూ, సోషల్ మీడియా వేదికగా ఓ అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కొందరు వ్యక్తులు మంగ్లీ పేరును ఉపయోగిస్తూ మైక్రో ఫైనాన్స్ పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారనే వార్తలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆమె స్పందిస్తూ, "నా పేరుతో డబ్బులు సేకరిస్తున్నారని వస్తున్న వార్తలు పూర్తిగా అసత్యం. నాకు ఆ వ్యక్తులతో గానీ, వారి ఫైనాన్స్ వ్యాపారాలతో గానీ ఎలాంటి సంబంధం లేదు" అని తెలిపారు.మంగ్లీ తన ప్రకటనలో , తనను మరియు తన కుటుంబ సభ్యులను చాలా మంది ప్రొఫెషనల్ ఈవెంట్స్ కోసం సంప్రదిస్తుంటారని చెప్పారు. అయితే, ఆ ఈవెంట్స్‌కు సంబంధించిన ఆహ్వానాల వరకే తమకి పరిచయం ఉంటుందని, వారి వ్యక్తిగత వ్యాపారాల గురించి తాము ఎలాంటి బాధ్యత వహించబోమని స్పష్టం చేశారు. అలాగే, తన పేరును ఉపయోగించి మోసాలకు పాల్పడటం అన్యాయమని, ఇది తన వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కరెన్సీ వీడియోలు, ఫైనాన్స్ వ్యవహారాలకు తమ కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని ఆమె మరోసారి క్లియర్ చేశారు.నా ప్రొఫెషనల్ ఈవెంట్స్ తప్ప నాకు ఎలాంటి వ్యాపారాలు లేవు. ఎవ్వరైనా నా పేరు చెప్పి డబ్బులు అడిగితే దయచేసి నమ్మకండి. అలాంటి మోసాలకు గురైన వారికి న్యాయం చేయాలని పోలీస్ శాఖను కోరుతున్నాను అని మంగ్లీ విజ్ఞప్తి చేశారు. ఈ ప్రకటనతో, మంగ్లీ పేరును వాడుకొని జరుగుతున్న మోసాలపై ప్రజల్లో అవగాహన పెరిగే అవకాశం ఉంది. ఇకపై ఇలాంటి ఘటనలపై జాగ్రత్తగా ఉండాలని ఆమె అభిమానులకు సూచించారు.ఇక ఇదిలా ఉంటే ఇటీవల మంగ్లీ పాన్–ఇండియా చిత్రం ఖణ: ది డెవిల్ సినిమా కోసం ఒక పాట పాడింది. 'సర్కే చునర్ తేరి సర్కే' పాటలో డబుల్ మీనింగ్ లిరిక్స్ ఉన్నాయనే ఆరోపణలతో సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.ఈ క్రమంలో మంగ్లీ సోషల్ మీడియాలో స్పందిస్తూ... 'ప్రజల భావోద్వేగాలను గౌరవిస్తూ ఈ పాటను తొలగించాం. అనుకోకుండా జరిగిన పొరపాటుకు హృదయపూర్వక క్షమాపణలు' అని తెలిపారు.

## తరుణ్ భాస్కర్ 'గాయపడ్డ సింహం'

# థియేటర్లలోకి వచ్చే టైం ఫిక్స్..!




టాలీవుడ్ యాక్టర్ కమ్ డైరెక్టర్ తరుణ్ భాస్కర్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం 'గాయపడ్డ సింహం కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఫరియా అబ్దుల్లా, మానసా చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. డైరెక్టర్ పవన్ సాధినేని సమర్పకుడిగా వ్యవహరిస్తున్నాడు. రీసెంట్‌గా ఈ సినిమాకు సంబంధించి టీజర్, ట్రైలర్ కలయికతో 'ట్రైజర్'ను తాజాగా విడుదల చేయగా.. మంచి స్పందన వస్తోంది. ట్రైజర్ సైటెరికల్ కామెడీ బ్యాక్ డ్రాప్‌లో యాక్షన్ ఎలిమెంట్స్ తో కలయికతో ఫన్‌గా సాగుతూ మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచుతోంది. అమెరికా వెళ్లాలని కలలు కనే ఓ యువకుడి జీవితంలో చోటుచేసుకునే సంఘటనల చుట్టూ సినిమా తిరుగుతుందని ట్రైజర్‌తో హింట్ ఇచ్చాడు. ఆ యువకుడు వీసా రిజెక్ట్ కావడంతో అతడు ఎదుర్కొనే నిరాశ, ఫ్రస్ట్రేషన్, ఆ తర్వాత తీసుకునే నిర్ణయాలు కథకు ప్రధానాంశాలుగా ఉంటాయని ట్రైజర్ హింట్ ఇచ్చేస్తుంది. మధ్య మధ్యలో వచ్చే యాక్షన్ ఎపిసోడ్‌లు, కేజీఎఫ్ స్పూఫ్ సన్నివేశాలు, అమెరికా వెళ్లకపోయినా హీరో ఇచ్చే బిల్డప్ డైలాగులు వినోదాన్ని పంచుతున్నాయి. ప్రత్యేకంగా ట్రైజర్‌లో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను సూచించే విధంగా చూపించిన సన్నివేశాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. అమెరికా వీసా నిబంధనల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న యువత ఆవేదనను ప్రతిబింబించే ప్రయత్నం చేసినట్లు అనిపిస్తోంది. మూవీ లవర్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న విడుద తేదీపై మేకర్స్ క్లారిటీ ఇచ్చేశారు. ఈ మూవీ మే 1న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. రాంచరణ్ నటిస్తోన్న పెద్ది రిలీజైన మరుసటి రోజే అన్నమాట. దిల్ రాజు ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో పంపిణీ చేస్తున్నారు. ఈ మూవీలో విష్ణు ఓయ్, హర్షవర్ధన్, శుభలేఖ సుధాకర్ ఇతర నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సప్తస్వ మీడియా వర్క్స్,రూపం స్టోరీస్, జీస్టూడియోస్ బ్యానర్లపై కళ్యాణ్ చక్రవర్తి మంథిన, భాను కిరణ ప్రతాప, విజయ్ కృష్ణ లింగమనేని, ఉమేశ్ బన్సాల్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

# బైకర్‌తో బ్లాక్‌బస్టర్ కొట్టబోతున్నా



'మొన్న 'నారీ నారీ నడుమ మురారి' సినిమా విషయంలో చెప్పి మరీ హిట్ కొట్టాను. ఈసారి 'బైకర్'తో బ్లాక్‌బస్టర్ కొట్టబోతున్నా' అని నమ్మకంగా చెప్పారు హీరో శర్వానంద్. ఆయన హీరోగా నటించిన భారీ రేసింగ్ డ్రామా 'బైకర్'. అభిలాష్‌రెడ్డి దర్శకుడు. డా.రాజశేఖర్ కీలక పాత్ర పోషించారు. యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 3న విడుదల కానుంది. జూ×ు, 4ణశ,ాజశ ఫార్మాట్లలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ని లాంచ్ చేశారు. ట్రైలర్‌లో రేసర్‌గా శర్వానంద్ ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ మెస్మరైజ్ చేసింది. ఇందులో శర్వానంద్‌కు తండ్రిగా, గురువుగా రాజశేఖర్ నటించినట్టు ట్రైలర్ చూస్తే అర్థమవుతున్నది. వారిద్దరి మధ్య భావోద్వేగాలు కథకు ప్రధానబలమని తెలుస్తోంది. మాళవిక నాయర్, అనురాగ్ కులకర్ణి కీలక పాత్రలు పోషించారు. సీనియర్ హీరో రాజశేఖర్‌తో కలిసి నటించడం ఓ గొప్ప అనుభవమని, దర్శకుడు అభిలాష్ సినిమాను అద్భుతంగా తీశాడని శర్వా అన్నారు. ఈ పాత్ర తనకు బాగా నచ్చిందని డా.రాజశేఖర్ చెప్పారు. శర్వాతో కలిసి నటించడం పట్ల ఆయన ఆనందం వెలిబుచ్చారు. ఈ సినిమాలోని ప్రతి రేస్ సీన్ వెనుక ఒక మంచి ఎమోషన్ ఉంటుందని దర్శకుడు అభిలాష్ తెలిపారు. ఇంకా దిల్‌రాజ, బన్నీవాసు, మాళవిక నాయర్, సంగీత దర్శకుడు జిబ్రాన్, డీవోపీ జె.యువరాజ్ కూడా మాట్లాడారు.

## ఒంటరిగా కూర్చుని

# ఏడ్చేదాన్ని



కెరీర్ ప్రారంభంలో కథానాయిక శ్రీలీలను ట్రోలింగ్స్ చాలా ఇబ్బంది పెట్టాయట. ఈ కారణంగా ఓ దశలో ఆమె కన్నీటి పర్యంతం అయ్యిందట. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఈ విషయాలను వెల్లడించింది శ్రీలీల. 'నేను చాలా సెన్సిటీవ్. అందుకే కెరీర్ తొలినాళ్లలో నాపై వచ్చిన ట్రోల్స్ చూసి తట్టుకోలేకపోయాను.

ఒంటరిగా కూర్చొని ఏడ్చేదాన్ని. ఓ దశలో అవి శృతిమించడంతో నా మనసంతా నిరాశ అలముకుంది.సినిమాలు నా ఒంటికి పడవని నిర్ణయానికి వచ్చేసి, ఆ విషయాన్ని అమ్మకు చెప్పాను. కాలేజ్‌కెళ్లి చదువుకుంటానన్నాను. అప్పుడు అమ్మ చెప్పిన మాటలు నాలో మార్పుని తెచ్చాయి. 'నీ గురించి వాళ్లు అంత సమయాన్ని వృథా చేసుకుంటున్నారంటే నువ్వు ఎదిగావని అర్థం. ఎంతో పుణ్యం చేసుకుంటే తప్ప హీరోయిన్ కాలేరు. ఈ ఫేమ్ తేలిగ్గా రాదు.. అర్థం చేసుకో..' అని అమ్మ నచ్చజెప్పింది. అప్పట్నుంచి ట్రోల్స్‌ని చదవడం, చూడటం మానేశా. నెగిటివ్ కామెంట్స్‌ని ఎలా డీల్ చేయాలో నేర్చుకున్నా' అంటూ తనలో వచ్చిన మార్పు గురించి గర్వంగా చెప్పుకున్నది శ్రీలీల.

# 24 ఏళ్ల కలయిక.. అవధుల్లేని ఆనందం

**అ "పూర్వ "మధురస్మృతి**

**పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం**

**చదువులమ్మ బడి - అమ్మ ఒడి**

**సమ్మేళనంలో పాల్గొన్న 1993-2002 బ్యాచ్ విద్యార్థులు**



ఇబ్రహీంపట్నం(ప్రశ్న న్యూస్) ఆనాటి జ్ఞాపకాలు ఎప్పటికీ మధురస్మృతులే. యాచారం మండల పరిధిలోని కురిమిద్ద పాఠశాలకు చెందిన 7వ తరగతి 1993- 2002 సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు కురిమిద్ద ప్రభుత్వ పాఠశాలలో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారంతా తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. దేశ, విదేశాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో స్థిరపడినవారు ఒక చోట కలుసుకుని పాత జ్ఞాపకాలను తలచుకున్నారు. 24 సంవత్సరాల తర్వాత స్నేహితులంతా ఒకేచోట చేరడం చాలా సంతోషాన్ని ఇస్తుందని అన్నారు. మానవ జీవితంలో కులమతాలకు అతీతంగా ఉన్నది కేవలం ఒక స్నేహం మాత్రమేనని అన్నారు. జీవితంలో ఎంత ఉన్నత స్థాయిని ఎదిగిన స్నేహాన్ని మాత్రం మరువలేమన్నారు. ఎవరి ఏ కష్టం వచ్చిన తోటి విద్యార్థులకు అండగా నిలబడాలని నిర్ణయం తీసుకున్నారు. తాము కలిసి చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. ఆనాటి తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. 24 సంవత్సరాల తర్వాత ఇలాంటి వేడుక చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు ఒక్కొక్కరూ ఒక్కొక్క రంగంలో సెటిల్ అవ్వడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు తమ జ్ఞాపకాలను తలుచుకుంటూ, స్వీయ చిత్రాలు తీసుకొని సందడిగా, సంతోషంగా ఆడి పాడారు. ఆనాడు గురువులు తమకు బోధించిన బోధనలు సూచించిన మార్గాలు నేర్పిన క్రమశిక్షణనే తమను ప్రస్తుతం సమాజంలో ఇంతటి ఉన్నత స్థానంలో నిలబడగలిగేలా ప్రేరేపించాయనీ ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. అనంతరం పూర్వ ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువాలతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. సమ్మేళనంలో ఉపాధ్యాయులు అంజయ్య, రాజశేఖర్, సరస్వతి, మంజుల, చంద్రకళ, పూర్వ విద్యార్థులు కల్లేపల్లి రవీందర్, జాన్, మూలి మహేందర్, కల్లెపల్లి మహేందర్, శ్రీనివాస్, రవి, శ్రీశైలం, సురేష్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

## రాంపూర్ గ్రామంలో సిసి రోడ్లు పనులను ప్రారంభించిన సర్పంచ్ సంగమేశ్వర్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండలం రాంపూర్ గ్రామంలో ఎమ్మెల్యే సునీత రెడ్డి సహకారంతో ఎన్ఆర్ఈజీఎస్ సీసీ రోడ్డు నిర్మాణ పనులు కోసం మూడు లక్షల రూపాయలు మంజూరు అయ్యాయి సర్పంచ్ నెల్లి సంగమేశ్వర్ సిసి రోడ్ పనులు ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు తెలంగాణ గ్రామాన్ని అభివృద్ధి చేస్తారని పేర్కొన్నారు మూడు లక్షల నిధులు మంజూరు చేయడంపై సునీత రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీశైలం టిఆర్ఎస్ సీనియర్ నాయకులు పోచయ్య వార్డు సభ్యులు బాలమణి మంగమ్మ సాయిలు రాందాస్ నాగేందర్ నాయకులు గురు ప్రసాద్ ప్రశాంత్ ముదిరాజ్ తో పాటు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ప్రశాంతంగా కొనసాగుతున్న 10వ తరగతి పరీక్షలు

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) జిల్లాలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా కొనసాగుతున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు.సోమవారం జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు కల్పించిన మౌలిక సదుపాయాలు, పర్యవేక్షణ ఏర్పాట్లు తదితర అంశాలను పరిశీలించారు.పరీక్షలు ఎలాంటి అంతరాయం లేకుండా పారదర్శకంగా, క్రమశిక్షణతో నిర్వహించేందుకు సంబంధిత అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని ఆయన ఆదేశించారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని సూచించారు.పరీక్షా కేంద్రాలలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు అమలు చేయాలని, సెల్‌ఫోన్లు మరియు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రాల్లోకి అనుమతించకూడదని స్పష్టం చేశారు. అలాగే విద్యార్థులను పరీక్ష హాలులోకి అనుమతించే ముందు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

ఈ తనిఖీలలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ త్యాగ స్ఫూర్తితో కార్పొరేట్ల, సామ్రాజ్యవాద, మతోన్మాద, ప్రభుత్వ విధానాలపై పోరాడదాం

**సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు హాజరై భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల సమర్పించారు. ఈ సందర్భంగా కడారి నాగరాజు మాట్లాడుతూ భారతదేశానికి బ్రిటీష్ వారినుండి రాజకీయ స్వాతంత్ర్యం సాధించడం మాత్రమే లక్ష్యం కాకూడదని, భారతదేశంలోని రైతాంగం, శ్రామికులు శ్రమదోపిడీ లేనటువంటి సమాజం కోసం పోరాడాలని దానికి సోషలిజమే పరిష్కారమని భావించి తాను స్థాపించిన హిందుస్థాన్ రిపబ్లికన్ ఆర్మీ అనే సంస్థను హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ ఆర్మీ గా మార్చాడని, భగత్ సింగ్ జాతీయ ఉద్యమంలో వీరోచిత పాత్ర నిర్వహించాడని అన్నారు. ఇంక్విలాబ్ జిందాబాద్ అనే నినాదాన్ని దేశప్రజల ముందుంచాడని అన్నారు. శాస్త్రీయ భావజాల వ్యాప్తికి కృషిచేసిన భగత్ సింగ్ మార్క్సిస్టు అవగాహనతో ఉద్యమాన్ని ప్రారంభించి అతి చిన్న వయసులో ఉరికంభం ఎక్కిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ లు అమరవీరులని ఆయన అన్నారు. నేడు సామ్రాజ్యవాదులు విచ్చలవిడిగా ఇతరదేశాల మీద దాడులు చేసి ఏకపక్ష యుద్ధాలకు పాలపడినా, సుంకాలను విధించినా కనీసం అలీనోద్యమ స్ఫూర్తితో కూడా భారత్ ఖండించలేకపోవడం అత్యంత దారుణమని అన్నారు. భగతసింగ్ వర్ధంతి సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు, సభలు నిర్వహిస్తోందని ఆయన అన్నారు. భగతసింగ్ ఆశయాలను అధ్యయనం చేయాలని, భగతసింగ్ వీలునామా పుస్తకాన్ని ప్రతిఒక్కరూ చదవాలని నేటి యువతరానికి ఆయన పిలుపునిచ్చారు. సామ్రాజ్యవాద శక్తులకు, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడుతూ లౌకిక విధానాన్ని కాపాడుకోవడమే భగత్ సింగ్ కు అందించే నిజమైన నివాళి అని ఆయన అన్నారు. అనంతరం భగతసింగ్ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన "సామ్రాజ్యవాద అమెరికా ఆధిపత్య విధానాలు మన భారతదేశం పై ప్రభావం" అనే అంశంపై జరిగిన వ్యాసరచన పోటీలో విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ, జిల్లా కమిటీ సభ్యులు షాఖుర్, నాయకులు రాములు, పుష్ప, పోచయ్య, మాణిక్యం, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలుకు సన్నాహాలు చేయాలి

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) జిల్లాలో రబీ సీజన్ ధాన్యం కొనుగోలుకు సన్నాహాలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ, పౌర సరఫరా, అటవీ, స్త్రీ శిశ సంక్షేమ శాఖలు అధికారులందరితో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. జిల్లాలో రబీ సీజన్ కు సంబంధించి ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సన్నాహాలు చేయాలని అధికారులు ఆదేశించారు. ఏప్రిల్ 15 నుండి ధాన్యం కొనుగోలు కేంద్రాలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలని సూచించారు. యాసంగి (రబీ) లో 4,45,466 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని స్వీకరించడానికి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మెదక్ జిల్లాలో వన మహోత్సవంలో కార్యక్రమంలో లక్ష్యంగా మొక్కలు నాటి వాటి సంరక్షించాల్సిన బాధ్యత అధికారుల ది అన్నారు. ఈ సంవత్సరం వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లాకు 31.7 లక్షల మొక్కలు నాటాలని నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పటిష్ట కార్యచరణ తో సిద్ధంగా ఉండాలన్నారు. జూలై మొదటి వారంలో ప్రారంభించే ఈ కార్యక్రమానికి జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నర్సరీలలో ఎక్కడెక్కడ మొక్కలు లభ్యమవుతాయి ఏ ఏ మొక్కలు నాటాల్సి ఉంటుంది అలాగే 2027 టార్గెట్, 2028 లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిక అనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు.బాల్యవివాహాలు నిషేధించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. తక్కువ బరువు, ఎత్తు కలిగిన చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. తక్కువ బరువు, ఎత్తు ఉన్న పిల్లల్ని గుర్తించి పరిత వెతిన సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి , ఇతర దరఖాస్తులను పరిశీలించి శాశ్వతంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, అధికారులు పాల్గొన్నారు.

## ఆరోగ్యమే మహాభాగ్యం - ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**- మల్కాపూర్ గ్రామ సర్పంచ్ : మడ్లపల్లి తులసి - గంగయ్య**

**- మెడికవర్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో రేపే మెగా వైద్య శిబిరం**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్ ) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, మల్కాపూర్ గ్రామంలో రేపు బుధవారం నిర్వహించబడనున్న ఉచిత మెగా వైద్య శిబిరం సందర్భంగా గ్రామ సర్పంచ్ మడ్లపల్లి తులసి-గంగయ్య గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల ఆరోగ్యం దృష్ట్యా మెడికవర్ హాస్పిటల్స్, కరీంనగర్ వారి సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుత కాలంలో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందని సూచించారు.ఈ శిబిరంలో ఎత్తు, బరువు, బీపీ, జి.ఆర్.బి.యస్, ఈసిజి వంటి ముఖ్య పరీక్షలు ఉచితంగా నిర్వహించబడతాయని, అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో డాక్టర్ కన్సల్టేషన్ కూడా అందుబాటులో ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇలాంటి వైద్య సేవలు అందడం అరుదైన అవకాశం కాబట్టి అందరూ తప్పక హాజరై తమ ఆరోగ్యాన్ని పరీక్షించించుకోవాలని కోరారు.గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 7 గంటల వరకు ఈ శిబిరం నిర్వహించబడుతుందని, యువత, మహిళలు, వృద్ధులు అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ తులసి-గంగయ్య విజ్ఞప్తి చేశారు.

## సాయి సుధీర్ కళాశాలలో ట్రై ఇంపాక్ట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభోత్సవం



కాప్రా ( ప్రశ్న న్యూస్)ఇసిఐ ఎల్ లోని సాయి సుధీర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో రీసెర్చ్ హైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్రై ఇంపాక్ట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ క్లబ్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఎంతో ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ వి. బాలకృష్ణారెడ్డి (చైర్మన్ తెలంగాణ ఉన్నత విద్యా మండలి) గౌరవ అతిథులుగా ప్రొఫెసర్ పి బాల భాస్కర్ ప్రత్యేక అతిథిగా సూర్య ప్రకాష్ గౌడ్ రీసెర్చ్ హైట్ పౌండేషన్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ కె నాగేంద్ర సాయి సుధీర్ కళాశాల చైర్పర్సన్ శ్రీమతి ఉషారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల మేనేజ్మెంట్ చైర్మన్ రీసెర్చ్ ఫౌండేషన్ డైరెక్టర్ మెమరాండం ఆఫ్ అండర్స్టాండింగ్ పత్రాన్ని పరస్పరం మార్చుకున్నారు. సాయి సుధీర్ ఇంపాక్ట్ క్లబ్ విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొని వారి ఇన్నోవేటివ్ ప్రాజెక్టులను ప్రదర్శించారు ఆ తర్వాత జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి ప్రొ. బాలకృష్ణ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ప్రదర్శనలు వినూత్నంగా ఉన్నాయని ఇలానే ఎక్కువ మంది విద్యార్థులు రీసెర్చ్ లో పాల్గొని కళాశాలకు తల్లిదండ్రులకు దేశానికి గర్వకారణంగా నిలవాలని సూచించారు కళాశాల ట్రై ఇంపాక్ట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అనేది భవిష్యత్తులో మంచి పరిశోధన ఫలితాలను అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రొ. బాల భాస్కర్ మరియు సూర్య ప్రకాష్ గౌడ్ , మాట్లాడుతూ ట్రై ఇంపాక్ట్ ఎన్నో విజయాలను సొంతం చేసుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మీరా రాణి ప్రొఫెసర్ పద్మ వైస్ ప్రిన్సిపల్ మోహన్ బాబు కళాశాల హెచ్ ఓ డి అధ్యాపకులుసిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## శ్రీరాం నగర్ 2బిహెచ్‌కే సమస్యలు పరిష్కరించాలి

**ప్రజావాణిలో కలెక్టర్‌కు లబ్ధిదారుల వినతి**



కాప్రా(ప్రశ్న న్యూస్ )కాప్రా సర్కిల్ పరిధిలోని శ్రీరాం నగర్ 2బిహెచ్‌కే కాలనీలో నెలకొన్న మౌలిక సదుపాయాల సమస్యలు పరిష్కరించాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ మను చౌదరికి వినతి పత్రం అందజేసి తమ సమస్యలను వివరించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు రాములు నాయక్, రవీందర్, గౌస్, షఫీ మాట్లాడుతూ.. కాలనీలోని వాణిజ్య సముదాయాలను వేలం వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. వాటిని కిరాయికి ఇస్తే వచ్చే ఆదాయం ద్వారా మెయింటెనెన్స్ ఖర్చుల భారం కొంతవరకు తగ్గుతుందని సూచించారు. కాలనీలో కనీస సౌకర్యాల లేమితో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. జీరో కరెంట్ బిల్లు అమలు చేయాలని, బస్తీ దవాఖాన ఏర్పాటు చేయాలని, 117 నంబర్ బస్సును శ్రీరాం నగర్ 2బిహెచ్‌కే వరకు పొడిగించాలని డిమాండ్ చేశారు. భవనాల స్లాబులు ఊడి పెచ్చులు రాలుతున్నాయని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. నీటి లీకేజీలను అరికట్టాలని తెలిపారు. లిఫ్ట్‌ల ఏఎంసీలను పొడిగించి, పనిలో లేని లిఫ్ట్‌లను తక్షణమే మరమ్మతులు చేయాలని, డబుల్ బెడ్‌రూమ్ కాలనీ చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు చేయడంతో పాటు వీధి దీపాలకు కేబుల్స్ వేయాలని కోరారు. సెల్లార్‌లో నీటి నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లబ్ధిదారుల సమస్యలపై కలెక్టర్ మను చౌదరి వెంటనే స్పందించి, సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో 2బిహెచ్‌కే లబ్ధిదారులు బాబురావు, కిషన్, సతీష్, సైదులు, యాదగిరి, రాజిరెడ్డి, ఇస్మాయిల్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

# "4" దిక్కుల చెత్త నడుమ చిత్తవుతున్న మార్కెట్

**- ఎమ్మెల్యే ని కాదని ఏ పని కాదు,విజ్ఞప్తిలు,విడ్కోలకే.? - గ్రామదేవత ను మరిచి,ఊర్లు తిరుగుతున్న మార్కెట్ పెద్దలు**

**- బోయిన్ పల్లి మార్కెట్ లో చెత్తతో దుర్వాసన,దోమలు, ఈగలు,హమాలీలు హాస్పిటల్స్ కి పరుగులు**







కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) రాజకీయ అనుభవం లేదు.వ్యక్తిగత కారణాలతో అభివృద్ధిని దూరం చేసుకుంటున్న వ్యక్తులు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే శ్రీగణేష్. మరో పక్క మైనంపల్లి హన్మంతరావు శిష్యులు మార్కెట్ కమిటీ చైర్మన్. అయితే గత కొంతకాలంగా ఇద్దరి మధ్యలో కొంత గ్యాప్ పెరిగింది.ఈ గ్యాప్ ని కవరు చేసుకోవడానికి ప్రజల్లో మాత్రం ఒకటిగానే వ్యవహరిస్తున్నారు. రాజకీయవిశ్లేషకులు మాత్రం నియోజకవర్గానికి పెద్దన్నపాత్ర పోషించేది కేవలం ఎమ్మెల్యేనే అంటున్నారు. ఆయన సహాయ సహకారంతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు జరుగుతాయి.అలాగే సర్కార్ నుంచి రావాల్సిన బకాయిలు విడుదల విషయంలో కూడా ఎమ్మెల్యే పాత్ర కీలకమైనది.ఒకవేళ ఆయనను కాదని ముందుకు పోతే ఆటంకమే తప్ప,దేనికి పరిష్కారం లభించదు. ప్రభుత్వం సైతం నియోజకవర్గం ఎమ్మెల్యే కేప్రాధాన్యత ఇస్తుంది తప్ప, ఇతర సిఫార్సులను పరిగణనలోకి తీసుకోదు.మరో విషయం ఏమిటంటే ఊర్లో గ్రామ దేవత తర్వాతే మిగతా దేవుళ్ళను పూజిస్తారు.అంతేగానీ గ్రామ దేవతను



మరిచి ఊర్లో ఉన్న దేవతలను ఎంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించిన ఎక్కడో ఒకచోట పొరపాటు అవుతుంది అన్న విషయం బుర్రకెక్కదు సాధారణ వ్యక్తులక.?ఈ చిన్న విషయం తెలుసో, తెలియకో మార్కెట్ కమిటీ చైర్మన్ గత పద్నాలుగు నెలలుగా బోయిన్ పల్లి మార్కెట్ లో ఒక్క అడుగు ముందుకు వెయ్యలేని దుస్థితి నెలకొంది.ఇక అభివృద్ధి మాట దేవుడెరుగు.**ఉదాహరణకు:** "55"లక్షల మంచి నీటి సరఫరా ప్రాజెక్టు,కమర్షియల్ కాంప్లెక్స్ తదితర విషయాల్లో చుక్కెదురైన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నిస్తున్నారు మార్కెట్ వర్గాలు. అలాగే గత కొన్ని రోజుల క్రితం బోయిన్ పల్లి మార్కెట్ కి స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ వచ్చినప్పుడు ఏపనైన ఒక్కసారి అడిగి వదిలేయద్దు. పదే పది వెనక పడాల్సిన అవసరం ఉంటుందని(చెప్పకనే చెప్పారు)తెలిపారు. అదే పొరపాటు నిన్న మళ్ళీ పునరావృతం అయ్యింది.ఇక నియోజకవర్గంలో భవిష్యత్తు ఎలా ఉండబోతుందో చూడాలి.

## చైర్మన్,అధికారులు, కమీషన్ ఏజెంట్లు పరుగులు..

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్‌లో గత కొన్ని రోజులుగా వ్యాపారస్తులు ,గుమాస్తాలు, హమాలీలు,ఖరీదు దారులు యార్డ్ లో పెరుకుపోయిన చెత్త వల్ల తలలు పట్టుకుంటున్నారు. గడిచిన ఇరవై ఐదు రోజుల నుంచి బోయిన్ పల్లి మార్కెట్ లో విధులు నిర్వహిస్తున్న హమాలీలు వివిధ రకాల రుగ్మతలతో కుస్తీ పడుతూ, సుస్తీ అవుతున్నారు.అలాగే పక్షం రోజుల క్రితం మార్కెట్ కి స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ వచ్చినప్పుడు కూడా కార్మికులు చెత్తతో ఎదురైతున్న సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అదిగాక మార్కెట్ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు,సెక్రటరీ ఈ.వేంకటేశానికి సైతం సమస్యను వివరించారు. అయిన కూడా ఎటు వంటి చర్యలు చేపట్టకపోవడంతో బోయిన్ పల్లి మార్కెట్ లో హమాలీ కార్మికులు సుమారు పదిహేను వందల మంది రాత్రి సమయంలో డ్యూటీలు చెయ్యమని తెల్చి చెప్పేశారు.దీంతో సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు సోమ దేవేందర్ రెడ్డి బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్, సెక్రటరీ, వ్యవసాయ డైరెక్టర్ మార్కెటింగ్ డైరెక్టర్ కి లేఖలు అందజేసిన పరిస్థితి ఎక్కడేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు ఉందన్నారు.నిన్న సోమవారం ఉదయం బోయిన్ పల్లి మార్కెట్ లో కమీషన్ ఏజెంట్లు,హమాలీలు వ్యాపారం లావాదేవీలు నిర్వహించలేమని రోడ్డేక్కారు. విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ చైర్మన్ సెక్రటరీ కలిసి మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీ బాయ్, హైదరాబాద్,రంగారెడ్డి విజిలెన్స్ అధికారి పద్మా హర్ష ను కలిసి బోయిన్ పల్లి మార్కెట్ లో నెలకొన్న చెత్త సమస్య పై సుదీర్ఘంగా చర్చించారు.ఉన్నతధికారుల హామీతో కమీషన్ ఏజెంట్లు సంతృప్తి పొందారు.

## నిజమే సిగ్గు పడాల్సింది..

విశ్వసనీయ సమాచారం మేరకు మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీ బాయ్ ని నిన్న సోమవారం మధ్యాహ్నం బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ సెక్రటరీ, గ్రేడ్ టూ, కమీషన్ దారులు కలిసి యార్డ్ లో నెలకొన్న చెత్త విషయం మాట్లాడుతున్న సమయంలో సాక్షాత్తు ఉన్నతధికారే "నిజమే సిగ్గు పడాల్సిన విషయం"అనడంతో ఒక్కసారిగా అందరూ ఆశ్చర్యానికి గురయ్యారు.వాస్తవానికి ఫైనాన్స్ డిపార్ట్మెంట్ లో పెండింగ్లో ఉన్నాయని మేము ఏం చేయలేని పరిస్థితిలో లేమని స్పష్టం చేశారు మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీ బాయ్.చేసేది ఏమి లేక వెనుదిరిగిన మార్కెట్ పెద్దలు.

## హైదరాబాద్,రంగారెడ్డి విజిలెన్స్ అధికారి వివరణ..

విశ్వసనీయ సమాచారం ప్రకారం నిన్న సోమవారం బుర్గుల రామకృష్ణ భవనంలో బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ సెక్రటరీ,గ్రేడ్ టూ, కమీషన్ ఏజెంట్లు హైదరాబాద్,రంగారెడ్డి విజిలెన్స్ అధికారి పద్మా హర్ష ని కలిశారు.ఈ నేపథ్యంలో బోయిన్ పల్లి మార్కెట్ లో చోటు చేసుకుంటున్న వివిధ రకాల పరిణామాలు పై చర్చించారు.

యుద్ధప్రాదిపదికన మౌళిక సమస్యల పై ఫోకస్ చేయాల్సిన బాధ్యత అధికారులదే అంటూ బోయిన్ పల్లి మార్కెట్ సెక్రటరీ ఈ.వేంకటేశం, యార్డ్ ఇంచార్జ్ గ్రేడ్ టూ అధికారి జె.సత్యనారాయణను మందలించారు.అలాగే రేపటి నుంచి మీ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతామని ఆమె హామీ ఇచ్చారు.

## కంటోన్మెంట్ లో నాదే పూచీ చైర్మన్..

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో గత కొన్ని రోజులుగా పెరుకుపోయిన చెత్తను తొలగించాలంటే డబ్బుతో కూడుకున్న వ్యవహారం,రాత పూర్వకంగా మీరు రాసిస్తే మేము రేపటి నుంచే రంగంలోకి దిగుతామని సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు హెల్త్ సూపరింటెండెంట్ మహేందర్ బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్,సెక్రటరీతో చర్చించారు.దీనికి నేనే పూచీగా ఉంటాను

అవసరమైతే నా వ్యక్తిగతంగా డబ్బులు చెల్లిస్తానని కంటోన్మెంట్ హెల్త్ అధికారులతో చర్చించినట్లు సమాచారం.? ఒకవేళ ఇదే నిజమైతే బోయిన్ పల్లి మార్కెట్ లో ఇక చెత్త సమస్యకు వీడ్కోలు పలికినట్లే.

# రైలు ప్రమాదాలకు 'కవచ్' అడ్డుకట్ట

**- కీలక మార్గంలో సేవలు ప్రారంభం**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** రైలు ప్రయాణాన్ని మరింత సురక్షితంగా, వేగవంతంగా మార్చే దిశగా భారతీయ రైల్వే కీలక ముందడుగు వేసింది. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే ఢిల్లీ-హౌరా కారిడార్‌లోని ప్రయాగ్‌రాజ్-కాన్పూర్ సెక్షన్‌లో స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 'కవచ్' ఆటోమేటిక్ రైలు భద్రతా వ్యవస్థను సోమవారం విజయవంతంగా ప్రారంభించినట్లు రైల్వే మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ప్రయాగ్‌రాజ్, కాన్పూర్ మధ్య సుమారు 190 కిలోమీటర్ల మార్గంలో ఈ వ్యవస్థను యాక్టివేట్ చేశారు. రైలు నంబర్ 14163 ద్వారా ఈ వ్యవస్థను అమలులోకి తీసుకురాగా, జనరల్ మేనేజర్ స్వయంగా సుబేదార్‌గంజ్ నుంచి మనౌరీ స్టేషన్ వరకు ఫుట్‌ప్లేట్ తనిఖీ నిర్వహించి పనితీరును సమీక్షించారు. డివిజనల్, హెడ్ క్వార్టర్స్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 'కవచ్' వ్యవస్థ, మానవ తప్పిదాల వల్ల జరిగే ప్రమాదాలను నివారించడానికి రూపొందించబడింది. లోకో పైలట్ పొరపాటున రెడ్ సిగ్నల్ దాటినా, ఈ వ్యవస్థ ఆటోమేటిక్‌గా బ్రేకులు వేసి రైలును నిలిపివేస్తుంది. రైలు వేగాన్ని, సిగ్నళ్లను నిరంతరం పర్యవేక్షిస్తూ భద్రతను నిర్ధారిస్తుంది. ఈ వ్యవస్థతో గంటకు 160 కిలోమీటర్ల వేగంతో రైళ్లను నడపడం సాధ్యమవుతుంది. తొలి దశలో చౌరీ చౌరా ఎక్స్‌ప్రెస్‌తో సహా 8 జతల రైళ్లకు ఈ సేవలను అందిస్తారు. రాబోయే నెలల్లో వందే భారత్ సర్వీసులతో పాటు మరిన్ని రైళ్లకు దీన్ని విస్తరించనున్నారు. ఈ వ్యవస్థను ప్రారంభించడానికి ముందు, రైల్వే శాఖ విస్తృతమైన ట్రయల్స్ నిర్వహించింది. వ్యాప్-7 ఇంజిన్లు, ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు, 20 కోచ్‌ల వందే భారత్ రైలుతో ట్రయల్స్ జరిపి, విశ్వసనీయతను నిర్ధారించుకున్నారు. 20,000 కిలోమీటర్లకు పైగా ప్యాసింజర్ ట్రయల్స్ కూడా ఎలాంటి సమస్యలు లేకుండా విజయవంతంగా పూర్తిచేశారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా ఢిల్లీ-ముంబై, ఢిల్లీ-హౌరా కారిడార్‌లలోని కీలక సెక్షన్లతో కలిపి 1,450 కిలోమీటర్ల మార్గంలో 'కవచ్' వెర్షన్ 4.0ను ఏర్పాటు చేశారు. 'మిషన్ రఫ్తార్'లో భాగంగా తదుపరి దశలో ఘజియాబాద్-తుండ్లా సెక్షన్‌లో ఈ వ్యవస్థను ప్రవేశపెట్టనున్నట్లు రైల్వే శాఖ అధికారులు తెలిపారు.

# అమెరికా హెచ్చరిక.. ఇరాన్ ప్రతిస్పందన

**- కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు!**



ముంబై (ప్రశ్న న్యూస్) అమెరికా, ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు భారత స్టాక్ మార్కెట్లను కుదిపేశాయి. సోమవారం ట్రేడింగ్‌లో అమ్మకాల సునామీ వెల్లువెత్తడంతో ఇన్వెస్టర్లు తీవ్రంగా నష్టపోయారు. భౌగోళిక రాజకీయ అనిశ్చితి కారణంగా సూచీలు భారీ పతనాన్ని నమోదు చేశాయి. ఈ భారీ పతనం ఫలితంగా బీఎస్ఈ సెన్సెక్స్ 1,836.57 పాయింట్లు నష్టపోయి 72,696.39 వద్ద ముగిసింది. అలాగే, ఎన్ఎస్ఈ నిఫ్టీ 601.85 పాయింట్లు కోల్పోయి 22,512.65 వద్ద స్థిరపడింది.

## పశ్చిమాసియాలో నెలకొన్న తాజా పరిణామాలే పతనానికి కారణం

పశ్చిమాసియాలో నెలకొన్న తాజా పరిణామాలే ఈ పతనానికి ప్రధాన కారణంగా నిలిచాయి. హర్మూజ్ జలసంధిని 48 గంటల్లోగా తిరిగి తెరవకపోతే తీవ్ర చర్యలు తప్పవని ఇరాన్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. దీనికి ప్రతిగా మధ్యప్రాచ్యంలోని ఇంధన మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ బెదిరించింది. ఈ పరిణామాలతో ముడి చమురు ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 2.37 శాతం పెరిగి 108.73 డాలర్లకు చేరింది.ఈ ఆందోళనలతో మార్కెట్లలో అస్థిరత తీవ్ర స్థాయికి చేరింది. ఇండియా వీఐఎక్స్ సూచీ ఏకంగా 17 శాతానికి పైగా ఎగబాకి 26.73 వద్ద ముగిసింది. బెంచ్‌మార్క్ సూచీలతో పోలిస్తే బ్రాడర్ మార్కెట్లలో నష్టాలు మరింత ఎక్కువగా ఉన్నాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 3.69 శాతం, స్మాల్‌క్యాప్ 4.16 శాతం చొప్పున పతనమయ్యాయి. రంగాల వారీగా చూస్తే, నిర్మాణ రంగ షేర్లు అత్యధికంగా 5 శాతానికి పైగా నష్టపోయాయి. రియల్టీ, మెటల్ స్టాక్స్‌లో కూడా భారీ అమ్మకాలు కనిపించాయి. అయితే, ఐటీ రంగ షేర్లు మాత్రం తక్కువ నష్టాలతో పోల్చిచూస్తే నిలకడగా నిలిచాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభలో మాట్లాడుతూ.. హర్మూజ్ జలసంధి ద్వారా ఇంధన సరఫరాకు అంతరాయం కలగకుండా ప్రభుత్వం నిరంతరం ప్రయత్నిస్తోందని హామీ ఇచ్చారు. ఇంధన భద్రత, ద్రవ్యోల్బణంపై ఆందోళనలు పెరగడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహిస్తున్నారు.

# నరకప్రాయంగా మేడ్చల్ జిహెచ్ఎంసి సర్కిల్

- మురుగునీటిలోనే ప్రయాణం.. పట్టించుకోని అధికారులు
- ఏరులై పారుతున్న మురుగునీరు.. అంటువ్యాధుల భయం
- వర్షం పడితే జలమయం.. చెరువులను తలపిస్తున్న రోడ్లు
- పురపాలక సంఘమే నయం.. జిహెచ్ఎంసిలో విలీనం శాపమైందా.?
- అధికారుల నిర్లక్ష్యం.. బాధ్యత ఎవరిది.?

**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** జిహెచ్ఎంసి మేడ్చల్ సర్కిల్ కార్యాలయం పరిధిలో ప్రజలకు అందించాల్సిన సౌకర్యాలు అట్టడుగు స్థాయికి చేరుకున్నాయి. గత కొంతకాలంగా డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారై, మురుగునీరు రోడ్లపై ఏరులై పారుతోంది. అడుగు తీసి అడుగు వేయాలంటేనే స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పన్నులు వసూలు చేయడంలో చూపుతున్న ఉత్సాహం, సమస్యల పరిష్కారంలో అధికారులు చూపడం లేదని స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ఏరులై పారుతున్న మురుగునీరు.. అంటువ్యాధుల భయం..



మేడ్చల్ సర్కిల్ కార్యాలయం పరిధిలోని ప్రధాన రహదారుల నుండి గల్లీల వరకు డ్రైనేజీ నీరు రోడ్లపైనే నిలిచిపోతోంది. డ్రైనేజీ పైపులు పూడిపోవడం, మేన్ హోల్స్ పొంగి పొర్లడం వల్ల పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మురుగునీటి వల్ల దుర్వాసన వెదజల్లడమే కాకుండా, దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా వంటి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

## వర్షం పడితే జలమయం.. చెరువులను తలపిస్తున్న రోడ్లు..

సాధారణ రోజుల్లోనే పరిస్థితి ఇలా ఉంటే, చిన్నపాటి వర్షం కురిసినా మేడ్చల్ రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. సరైన వర్షపు నీటి కాలువలు లేకపోవడంతో, వర్షపు నీరు మురుగునీటితో కలిసి రోడ్లపై మోకాలోతు వరకు చేరుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఈ నీరు నేరుగా ఇళ్లలోకి,



దుకాణాల్లోకి చేరుతుండటంతో సామాన్య ప్రజల జీవనం అస్తవ్యస్తమవుతోంది.

## పురపాలక సంఘమే నయం, జిహెచ్ఎంసిలో విలీనం శాపమైందా.?

మేడ్చల్ ప్రాంతం జిహెచ్ఎంసిలో విలీనం కావడమే తమకు శాపంగా మారిందని స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. గతంలో మేడ్చల్ పురపాలక సంఘంగా ఉన్నప్పుడు స్థానిక అధికారులు అందుబాటులో ఉండేవారని, ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే స్పందించేవారని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మేడ్చల్ పురపాలక సంఘం జిహెచ్ఎంసిలో విలీనమయ్యాక ఆస్తి పన్నులు, ఇతర ఛార్జీలు భారీగా పెరిగాయి. కానీ, ఆ స్థాయిలో మౌలిక సదుపాయాలు మాత్రం కల్పించడం లేదు. పన్నులు చెల్లిస్తున్నా చెప్పుకోలేని అవస్థలు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## అధికారుల నిర్లక్ష్యం.. బాధ్యత ఎవరిది.?

డ్రైనేజీ సమస్యపై అనేకసార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా, క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. "ఫిర్యాదు చేస్తే వస్తాం అంటారు. కానీ ఎవరూ రారు" అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు సైతం ఓట్ల సమయంలో కనిపించి, ఇప్పుడు సమస్యల వైపు కన్నెత్తి చూడకపోవడంపై నిరసన వ్యక్తమవుతోంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588